అదృష్టం

(మూడు కథలు)



IRVING WALLACE

సెప్టెంబరు 1990 రు. 2/-

మిసిమి

(మాస పత్రిక)

సంపుటి 1 15-9-1990 సంచిక 14

విషయసూచిక

ప్రసిద్ధ నవలా రచయిత ఇర్వింగ్ వాలేస్

— సంచారి

మానవవాదం-శాస్త్రీయ దృక్పథం

— రావిపూడి వెంకటాద్రి

విదేశాల్లో భారతీయుల అభ్యుదయం

తృతీయ ప్రపంచ దేశాలలో శాంతి స్థాపన

— రిచర్డ్ నిక్సన్

సద్దాం హుసేన్
(కుటుంబకథ)

— అన్వేషి

Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt.Ltd.
1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020.

ప్రసిద్ధ నవలా రచయిత ఇర్వింగ్ వాలేస్ — సంచారి

"నేను అవినీతిని గురించి గానీ, బూతులు గానీ వ్రాయలేదు — వ్రాయలేను. ప్రేమను, శృంగారాన్ని గురించి అరమరికలు ఏవీ లేకుండా వ్రాశాను. నేటి ప్రపంచంలో స్త్రీలకు సుఖభంగం ఎందుకు కలుగుతున్నది, ఎందువలన నిరాశ పొలవుతున్నారు అనే సమస్యలను గురించి సంశోధించి వ్రాస్తాను."

ఈ మాటలు అంటున్నది ఎవరు?

ప్రముఖ నవలా రచయిత డి.హెచ్. రెన్స్ తన "లేడీ చాటర్లీస్ లవర్" నవలలో, డంబాచారంపైనా, కృత్రిమ తి పైనా ధ్వజం ఎత్తి, స్పాతిశయంతో తులు చెప్తూ అవినీతిని కప్పి పుచ్చుకునే రిని అధిక్షేపిస్తూ, తన నవలలోని శృంగారతత్త్వాన్నీ తన భాషాశైలినీ ఎద్దేవా సే వారిని దుయ్యబడ్తూ, లేడీ చాటర్లీకి తిగానీ, శృంగార గౌరవంగానీ లేదనే రిని నవ్వులపాలు చేస్తూ, వెలయించిన మర్శనావళిలో చేరిన మాటలు కావు పైన పేర్కొన్నవి.

పైన పేర్కొన్న మాటలు అన్నది ర్వింగ్ వాలేస్. 1960లో వాలేస్ ణ్ణంగా పరిశోధన చేసిన మీదట (The hapaman Report) అనే నవల (ఇది తడి రెండో నవల) రచించాడు. పట్టణ గరికత అలవడిన వివాహిత స్త్రీల సమ స్యలు, వాళ్ల శృంగార ప్రవర్తనా విశేషాలు ఆ పుస్తకంలో వివరించాడు. ఆ పుస్తకాన్ని టలీ ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధిం చగా, దీనిపై ఇటలీ పత్రికా లోకానికి తన మర్శగా చెప్పుకున్నమాటలే పైన పేర్కొన్నవి. వాస్తవానికి ఆ నవల శృంగార ప్రాధాన్యం కలదికాదు -- అమెరి కాలో పట్టణ నాగరికత అబ్బిన స్త్రీలు ఎన్ని విధాలయిన అసుఖాలను అనుభ విస్తూ ఉంటారో, ఎన్ని రకాల ఉద్రేకా లకు లోనవుతూ వుంటారో ఈ నవలలో తెలియజెప్పాడు.

కథను కల్పించి, చెప్పుకుని పోవ డంలో వాలేస్ నిపుణుడు. కథాసంవిధా నంలో సహజ సన్నివేశాలలాగా, గిలిగిం తలు పెట్టేవిగా శృంగారాంశాలను పొందు పరిచాడు ఈ పుస్తకంలో. పుస్తకం అమ్మ కం బ్రహ్మాండంగా లక్షల్లో జరిగింది. దీనికి భిన్నంగా అతడి "ప్రేమ పూజారి" (Priest of Love)-- దీనిలో శృంగార చేష్టలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాడు. ఇంతకూ "చాప్మన్ రిపోర్ట్"లో అతడి కథనకళ, పాఠకులకు ఎంతో హృద్య మైంది. "ఏడవ రహస్యం" (Seventh Secret) అనే నవలలో ప్రేమ కలాపాన్ని దీర్ఘకాలిక శృంగార ప్రయత్నాలతో ఆత్రా లతో చిత్రీకరించాడు. మరొక నవల "మూడు వాడి కూతలు" (The three Sirens) చిడుము పట్టిన మనస్సులకు దర్పణం.

వాలేన్ రచనలంటే పాఠకలోకంలో వేలం వెర్రి ఉండనే ఉంది. అతడు శృంగారాన్ని ఒక వ్యాపార వస్తువుగా యథేచ్ఛగా వినియోగించుకున్నాడు. అట్లా పలువురు రచయితలు చేస్తూనే ఉన్నారు. కానీ వాలేన్ రచనలలో ఒక విశేషం ఉంది. పలువురికి చెవినపడిన విశేషాలే అయినా క్షుణ్ణంగా అవగతంకాని విశేషాలు, అవగతం అయ్యే అవకాశంలేని విశేషాలు అనేకం ఉంటాయి. అటువంటి వాటిని గురించి శోధించి, విశ్లేషణ పూర్వకంగా వివరించడానికి తగు కథా సన్నివేశం కల్పించి, వాటికి పఠనయోగ్యమైన స్థాయిని కల్పించడం ఆయన ప్రత్యేకత. సేకరణ యోగ్యమైన విశేషావళి, నిశేషాలకు తగిన వివరణలు, వివరణలకు అనువైన కథా సన్నివేశాలు, వాటికి సమతూగే శబ్దజాలం--ఇవీ ఆయన ప్రత్యేకతలు. మొదట మొదట రచించిన ''పీటర్ ఫ్లెమింగ్ పాపాలు'' ఆ తర్వాత ''అభిమానుల మేళం'' (ఫ్యాన్ క్లబ్)లకు తప్ప మిగతా అన్ని రచనలకోసం, తీవ్రమైన పరిశోధనలు చేసుకున్నానని అతడే చెప్పుకున్నాడు.

దండిగా అమ్మకాలు అనుభవించిన వాలేన్ రచనలన్నీ ఇట్లాంటివే... పరిశోధనా ఫలాలు. "The Prize" (బహుమతి)ను 1962లో వ్రాసినప్పుడు, ఒక గొప్ప అంతర్జాతీయ సంస్థను గురించి వివరించాను. అది నోబెల్ సంస్థ. దాని బహుమతులను నిర్ణయించే న్యాయ నిర్ణేతలతో మాట్లాడాను. ఆ సంస్థ రాజకీయాలను, దాని సంకుచిత భావాలను, దాని నిర్లక్ష్యాలను, దాని బలహీనతలను వివరించాను'' అన్నాడు వాలేన్. నోబెల్ సంస్థ నిర్ణేతలలో, బహుమతి గ్రహీతలలో నెలకొన్న లోపాలను బహిర్గతం చేశాడు అందువలన ఆ పుస్తకాన్ని నార్వే, స్వీడన్ దేశాలలో నిషేధించారు. ''బహుమతి''లో ఎక్కువ భాగం వాలేన్ వ్యక్తిత్వంతోనే నిండి ఉంది. దానిలో ఆండ్రూ క్రేగ్ అనే రచయిత ఒక పాత్ర. క్రేగ్ ముచ్చట యావత్తూ వాలేన్ అంతఃకరణకు ప్రతిబింబం. ఈ సంగతి వాలేన్ స్వయంగా చెప్పుకున్నాడు.

ఇక'మూడు వాడి కూతలు'' మెచ్చుకోళ్లు దండిగా ఆస్వాదించిన నవల. సౌత్ సీ (దక్షిణ సముద్రం) వాసులు, ఏ అరమరికలు లేకుండా అనుభవించే శృంగార సరళికి ప్రాధాన్యం యిచ్చిన రచన. ఈ సరళి నాగరకుల మనుకునే వారికి చాలా ఉత్సుకత కలిగిస్తుంది. కదూ! పాలినీషియన్ల స్వేచ్ఛా శృంగారాలను, అమెరికాకు చెందిన మానవ పరిణామ విజ్ఞాన నిపుణుల బృందం చూస్తుందనుకోండి. ఏమవుతుంది? విజ్ఞానుల నాగరక స్థాయి దెబ్బతిని పోదూ! ఏదో పెద్ద పేలుడులో చిక్కుకున్నంత పని అయిపోతుంది. కృత్రిమ ఆచార సంప్రదాయాలు కల్పించిన నియమాల వలన, మాయదారి విశ్వాసాల వలన, విజ్ఞానుల బృందంలో ఎవ్వడూ ఈ పాలినీషియన్లు సుష్టుగా అనుభవించే స్వేచ్ఛనూ, సుఖాన్నీ అనుభవించలేరు, అనుభవించడానికి యత్నించనూ లేరు. తృప్తికరమైన శృంగార జీవితం, నిస్సంకోచ శృంగార అనుభవం నాగరకులకు అందుబాటు కాదు.

ఒక నూతన కథా వస్తువునో, ఒక సాధారణ సన్నివేశావళినో ఊహిం చడం. పోనీండి, కలగడం! వీలైతే దానిని హాదాస్పదమైన అంశంగా తీర్చి దిద్దడం. టి ద్వారా పాఠకుల ఆసక్తిని ఉత్తేజ రుచడం, అటువంటి రచన ప్రణాళికను ధారం చేసుకొని కథ అల్లడం. ఇదీ వాలేన్‌కు సంతుష్టినిచ్చే సాహితీ వ్యాసంగం. లాస్ ఏంజలిస్ సమీప టారు ప్రాంతాలలో స్త్రీల శృంగార హావ భావ చేష్టాదుల సర్వేక్షణ మున్నెన్నడూ వ్వరూ చేసి ఉండరు. ఇర్వింగ్ వాలేన్ హేడు! ఈ సర్వేక్షణ ఫలితమే చాప్మన్ పోర్టు. ఆధునిక మహిళ ఎన్ని అవమానా ము భరిస్తూ ఉంటుంది, ఎన్ని అవమా నాలు ఎట్లా ఆమెకు అసంతుష్టి, అసుఖం లుగచేస్తూ ఉంటాయి అనేది అతడి రచ నకు జీవగర్ర.

1964లో ''మనిషి'' (The Man) అనే నవలను వెలువరించాడు వాలేన్. హాస ఊహా కల్పన. అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ఒక నీగ్రో అధ్యక్షుడు కావడం కథా వస్తువు! అమెరికా అధ్యక్షుని దిన చర్యను ఆకళించుకొనడానికి అతడు ధ్యక్ష నివాసంలో పది దినాలు గడిపాడు! రాత్యహంకారం ఒక ఉన్మాదం అని వాలేన్ దుయ్యబట్టాడు. ప్రతి వ్యక్తికీ ధర్మం కింద, సమాజ మర్యాదల పట్ల ఆసక్తి బలహీనతల పాతరలు నిహితమై ఉండవని అతడి తీర్పు.

కలుషం కాని కల్పన, వాస్తవాలతో తుల తూగ లేదు. కాబట్టి వాస్తవాలను కూడా కల్పన ఇముడ్చుకోవాలి. ఆపైన కల్పన ము వాస్తవాలను అధిగమించి, పాఠకులకు విసుగు కలగకుండా మానవ నైజాన్ని అనుసరించే కథన సరళిని జాగ్రత్తగా అవ లంబించాలి-అని ఇర్వింగ్ వాలేన్ వాదన.

బైబిలు (న్యూ టెస్ట్‌మెంట్)ను కాదని ఒక కొత్త మత గ్రంథాన్ని కనుగొన్నారను కుందాం. [1972లో వాలేన్ వ్రాసిన ''ది వర్డ్'' (శబ్దం) అనే నవలకు ఆధార కథా వస్తువు] దీనిలో వాస్తవమూ, కల్పన పడుగు పేకల వలె అల్లుకుపోవడం వాలే న్‌కు గల సహజ నైపుణికి తార్కాణం. పాఠకులను ఆకట్టుకునే ప్రత్యేకత ఇదే కదా. ఇదంతా నిజమనే భ్రమను కల్పించే సన్నివేశాలు... కొంతవరకు ఊహాబలం వలననే ఈ రచనను చేసినాననీ, న్యూ టెస్ట్‌మెంటును రూపొందించినప్పుడు, అదే సరియైనదని ఆమోదించినప్పుడు, వదలివేసిన అనేక భాగాలను, చిరకాలంగా ఆ భాగాల పట్ల చూపిన నిరాదరణను గ్రహించుకుని, ఈ రచనను చేసినాననీ తన అభిమానులకు తెలియ జెప్పాడు వాలేన్. ''నేను రచించిన బైబిల్ భాగం, ఉత్తమ పరిశోధనా ఫలం. పురావస్తు విజ్ఞా నుల అన్వేషణ నిరూపణ. ప్రముఖ బైబిల్ పండితుల సిద్ధాంతీకరణలకు విచార ధారకు దర్పణం. ఇవన్నీ కలిసి నా రచనకు వాస్తవికతను సంతరించి పెట్టాయి'' అన్నాడు వాలేన్.

ఇంతకూ నవనవోన్మేష భావనల సమ్మేళనగా నవల రూపొందాలంటాడు వాలేన్. ''అసాధారణ పద్ధతిలో సమస్యల పరిష్కారానికి ఉన్ముఖం అయ్యే బాణీని వ్యక్తం చేసే నవలగా ఉండాలి'' అని అతడి ఆశయం. అతడు ఏనాడూ భావాల క్షామాన్ని అనుభవించలేదు. అతడి

భావాలు ఏనాడూ క్షీణించి పోనూ లేదు. వాటర్‌గేట్ సంక్షోభానంతరం 1976లో అతడు వ్రాసిన ''ది డాక్యుమెంట్'' (పత్రం), రహస్య పోలీసు శాఖ వారు (ఎఫ్‌బిఐ) ప్రాథమిక హక్కులను అణచి వేసి అధికారాన్ని హస్తగతం చేసుకొనడానికి చేసిన యత్న వివరణ నవనీకృతం. 1979లో వ్రాసిన నవల 'పీజియన్ ప్రాజెక్ట్' (పావురం ప్రాజెక్ట్) చిరాయువు సాధనకై ఒక వైజ్ఞానిక రహస్యాన్ని స్వంతం చేసుకొనడంలో కొనసాగిన పంచమాంగ దళ భయానక చర్యాతతి.

వాలేస్ మేధా తరంగ వనంలో పుట్టిన ఊహలు, కథలు అనేకం. 1980లో వ్రాసిన ''సెకండ్ లేడీ'' (రెండవ మహిళ) కథకు సుతారంగా శృంగారలతను తను పాకించాడు. రష్యా రహస్య పోలీసువారు (కెజిబి) అమెరికా అధ్యక్షుని భార్యను పోలిన ఒక రష్యా మహిళను సమకూర్చడమే ఈ కుట్ర కథలో ప్రధాన అంశం.

''మిరకిల్'' (అద్భుతం)లో ఒక ప్రశ్న. 1858లో ఫ్రాన్స్‌లోని లూర్డ్స్ వద్ద మేరీమాత ఒక రైతు కుమార్తెకు సాక్షాత్కరించింది. మేరీమాత వేలాది జనుల ముందు ఒక అద్భుత చికిత్సను చెప్పడానికి మళ్లీ వస్తుందా? ఇదీ ఈ నవలలో ముఖ్యాంశం.

1986లో వ్రాసిన సెవెన్త్ సీక్రెట్ (ఏడవ రహస్యం) పాఠకుని ఒక అనిశ్చిత స్థితిలో పెట్టే కథనం. హిట్లర్ ఒక రహస్య స్థావరంలో తన ప్రియురాలు ఈవా బ్రాన్‌తో దాక్కుంటాడు.ఈలోగా అతడు మరణించాడని అందరూ నమ్ముతూ ఉంటారు. ఏళ్లు గడుస్తాయి. ఈ రహస్యం మెల్లంగా, ఒక మంద క్రమంలో బహిర్గతమవుతుంది.

నవలా రచయితలు సినిమా రచయితలు కావడం లాభసాటిగానే ఉంటుందంటాడు వాలేస్. ఈ భావం కొందరికి రుచించక పోవచ్చు. కానీ సినిమాకు వ్రాయడం వలన, ఒక్కొక్క సన్నివేశాన్నీ స్పష్టంగా వ్రాయడానికీ, దానిలో నాటకీయతను పోషించడానికీ, పాత్రల చర్యలను విశదంగా వాటి వాటి నైజాన్ని అనురించి తీర్చిదిద్దడానికీ అవకాశం కలుగుతుందంటాడు. నవలలు వ్రాయడానికి ముందు పత్రికా రచయితగా, సినిమా రచయితగా చాలా పనిచేశాడు వాలేస్. పత్రికలలో ఐదువందల వ్యాసాలు, కథానికలు ప్రచురించాడు. పదిహేను సినిమాలకు వ్రాశాడు. ఇది కాక అతడి నవలలు అనేకం సినిమా కథ లైనాయి. ఆ సినిమాలు బాగా నడిచినాయి కూడాను.

చదవడం, నేర్వడం కోసం నిత్యం కొంత కాలాన్ని వెచ్చించ తలపెట్టిన వ్యక్తి, రోజువారి జీవితంలో చాలా ఓపికతో వ్యవహరించాల్సి ఉంటుంది. ఏవేవో మరిచి పోవడానికీ, ఉల్లాసం అనుభవించడానికీ గదా పాఠకుడవుతాడు! నా నవల ఒకటి తీసుకుని, దీని పఠనంలో నిమగ్నుడు కావచ్చు. దీనిని చదువుతూ ఉల్లాసం అనుభవిస్తాడు, సమస్యలంపటం నుంచి తప్పించుకున్న సుఖం అనుభవిస్తాడు. కానీ అతడికి తెలియకుండగానే అతడికి బోలెడు విశేషాలు వాస్తవాలు

''ఛ్వంటీ సెవెన్త్ వైఫ్'' (ఇరవై ఏడవ భార్య) అనే నవల, నిజానికి జీవిత చరిత్ర. ఆన్ ఎలీజా యంగ్ అజీ అనే ఆమె జీవిత కథ. ఆమె ఒకని అంతఃపురంలోకి చేరు కుంటుంది. అక్కడ భార్యలు అనేకులు వారిలో ఆమె ఒకతె! అక్కడ నుంచి పారిపోయి, బహుభార్యత్వానికి వ్యతిరే కంగా అమెరికాలో ఉద్యమం నడుపు తుంది. ఇట్లా ఉంటాయి ఇర్వింగ్ వాలేన్ రచనలు.

ప్రపంచ విఖ్యాతరచయిత.

నవలవ్రాతలో విషయసేకరణకు పర్యవేక్ష ణకు ఎక్కువప్రాధాన్యము చూపే ప్రఖ్యాత రచయిత ఇర్వింగ్ వాలేన్ గతనెలలో కన్నుమూసాడు.

సవివరంగా బుర్రలోకి చేరుకుంటూ ఉంటాయి. ఇదొక కమ్మటి చదువు అవు తుంది. హాయిగా నేర్వడం అవుతుంది.

— ఇర్వింగ్ వాలేన్.

''బుక్ ఆఫ్ లిస్ట్స్'' (జాబితాల గ్రంథం) అతడు తన కుమారునితో, కుమార్తెతో కలసి రచించాడు. కల్పనా కథకాదు అయినా పాఠక లోకాన్ని బాగా ఆకట్టుకుంది. ప్రతి అంశానికీ చెందిన విశేషాలు అనేకం ఉంటాయి. కొన్ని ఊహాజనితాలు, కొందరు జనం కూడా ఉంటారు, అనేక సన్నివేశాలు వస్తాయి; ఇవన్నీ ఏ ఒక్క పుస్తకంలోనూ సంప్రాప్తిం చవు. అనేక సందర్భాలలో అనేక చోట్ల నుండి లభిస్తాయి. వాటిని వరసలో పేర్చితే, చక్కటి వివరణ అవుతుంది కదా.

''బండె త్రాళ్ళు తెచ్చి బంధించి కట్టంగ
లింగడేమి దొంగిలించి నాడొ
ఆత్మ లింగమునకు నర్చింప నేరరో....''

''బట్ట త్రాళ్ళతోను బంధించి కట్టంగ
లింగ మెవరిసోమ్ము దొంగిలింప
నాత్మలోని లింగ మటువలె నుండునే....''

— వేమన

మానవవాదం - శాస్త్రీయ దృక్పథం

— రావిపూడి వెంకటాద్రి

మానవతావాదం వేరు, మానవవాదం వేరు. ఈ రెండు పదాలనూ కలగా పులగంచేసి వాడడంలో కొంత గందరగోళం వుత్పన్నమౌతుంది.

మానవతావాదమంటే హ్యూమనిటేరియనిజం; మానవవాదం అంటే హ్యూమనిజం. ఇందులో మొదటి దాని లక్షణం హ్యూమేన్ (Humane), రెండవ దాని లక్షణం హ్యూమన్ (Human).

దయాదాక్షిణ్యాలు, కారుణ్యం ప్రదర్శించే లక్షణాన్ని మానవతా వాదమంటారు. నిజానికది లక్షణమే కాని వాదం కూడా కాదు. దానికి శాస్త్రీయ దృక్పథంతో పనిలేదు.

ఆ లక్షణం మానవవాదంలో కూడా ఉన్నప్పటికీ, మానవవాదం చాల విస్తృత మయినది. అది మనిషిని మనిషిగానే చూస్తుంది కాని, జాతి, మత, కుల, వర్గాదుల్లో భాగంగా చూడదు. మనిషికి సంబంధించిన అంశాలన్నిటిలోనూ మనిషినే సర్వం సహాధికారిగా, నిర్ణయాధికారిగా పరిగణిస్తుంది. మనిషి తన భవితవ్యాన్ని తానే నిర్ణయించుకోగలడని నమ్ముతుంది. మానవుడే మానవజాతికి మూలమనీ, అన్నింటికీ కొలమానమనీ అంగీకరిస్తుంది. మానవ చరిత్రకు మానవుడే కర్త అని వుటంకిస్తుంది. మనిషిని మరొకదానికి పరాధీనుడుగా భావించడం మానవవాద భావానికే విరుద్ధం. మానసిక స్వావలంబన దానికి మిత్రము. వైమవస్యత (మానసిక పరాధీనత) దానికి శత్రువు.

ఇలా అంటున్న మానవవాదం మూసపోసిన సిద్ధాంతం కాదు. అదొక తాత్విక ధోరణి; మానవుడి నిత్య జీవితంతో ముడిపెట్టుకొన్న దార్శనిక వైఖరి. నిత్య పరిణామం చెందుతున్న జ్ఞానంతో దానికి విడదీయరాని సంబంధం వుంది. అందువల్లనే విజ్ఞానశాస్త్రం, శాస్త్రీయ దృక్పథం దానికి ఆలంబనాలు. నిత్యజీవితాన్ని శాస్త్రజ్ఞానం నీడలో తులనాత్మకంగా నడుపుకోగల మానవవాద మార్గం కేవలం వైజ్ఞానిక కసరత్తు కాదు.

మానవవాదం అనే పదాన్ని ఈనాడు వివిధ వర్గాలవారు విరివిగా వాడుతున్నారు. ఇంతకుముందు సోషలిజం అనే పదాన్ని కూడా అలానే వాడేవారు. ఒక దశలో 'సోషలిస్టును కాను' అనేవాడు అభివృద్ధి నిరోధకుడుగా పరిగణించబడేవాడు. అందువల్ల ప్రతివాడూ తన ఆదర్శం సోషలిజమే అనేవాడు. ఫాసిస్టు హిట్లరు సిద్ధాంతం కూడా నేషనల్ సోషలిజమే కదా? అలానే ఈనాడు హ్యూమనిజం అనే పదాన్ని విచక్షణా

రహితంగా వాడుతున్నారు.

ఒక దశాబ్దికి పూర్వం మనదేశంలో ఆత్యయిక పరిస్థితిని ప్రకటించి, పౌరహక్కుల్ని హరించడానికి ప్రయత్నించిన ఇందిరాగాంధీ తనను తాను హ్యూమనిస్టుగా వర్ణించుకున్నారు. ఈ దేశంలోని హిందూ మతవాదులు కొందరు తమను తాము ఇంటెగ్రల్ హ్యూమనిస్టులమని పిలుచుకుంటున్నారు. మొన్న మొన్నటిదాక వర్గ నియంతృత్వం పేరుతో పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించిన రష్యన్ కమ్యూనిజం, హ్యూమనిజమనే మాట వింటేనే కస్సుమనేది; ఒక దశాబ్దం నుంచి హ్యూమనిజం పెట్టుబడిదారీ, సోషలిస్టు తరహాలుగా విభజిస్తూవచ్చి, ఇప్పుడు హ్యూమనిజం ఆవశ్యకమనే ధోరణికి వచ్చింది.

ఈ దేశంలో 1948లోనే హ్యూమనిస్టు ఉద్యమాన్ని ప్రారంభించి, ప్రపంచం నలుమూలల్లో వేర్వేరు పేర్లతో పిలవబడుతున్న హ్యూమనిస్టు సంస్థలను, మేధావులను సమీకరించి, 1952లో అంతర్జాతీయ మానవవాద నైతిక సంఘం (IHEU) స్థాపనలో భాగం పంచుకున్న ఎం.ఎన్. రాయ్ ప్రపంచ సమస్యల పరిష్కారానికి హ్యూమనిజమొక్కటేమార్గమన్నాడు.ఏ వైఖరిని తాను హ్యూమనిజం అంటున్నాడో వివరించడానికి ఎన్నో గ్రంథాలు వ్రాశాడు. ప్రసంగాలు చేసాడు.

ఇన్ని రకాల ప్రకటనల్లో ఏది వాస్తవం, ఏది నిజమైన హ్యూమనిజం, ఏది శాస్త్రీయ దృక్పథాన్ని ఆసరా చేసుకున్నది అనే విషయాన్ని మనం జాగ్రత్తగా పరిశీలించవలసివుంది.

ఈనాడు ప్రపంచంలో ఏ మూల చూచినా ఉద్రిక్త వాతావరణం వుంది. జాతుల మధ్య, మతాలమధ్య, మత శాఖలమధ్య, ఆధునిక మతరూపం అందుకున్న వివిధ ఆర్థిక - రాజకీయ వర్గాలమధ్య విద్వేషాలు ప్రబలి వున్నాయి. ఈ స్థితి మౌలికంగా కొత్తదేమీకాదు. మానవుడు ఇటీవలి కాలంలో ఆర్జించుకున్న ఆధునిక శాస్త్ర విజ్ఞానానికి అనుగుణంగా తాత్విక అవగాహన పెరగలేదు. అందువల్ల పాత విద్వేష వారసత్వం కొనసాగుతూనే వచ్చింది. మానవతను గురించి సుభాషితాలు వల్లించేవారు కూడా మానవ సంక్షేమం కోసమే మానవ సంహారకాండ సాగిస్తున్నామని వాదిస్తున్నారు. ఇదొక వింత ప్రకృతి. ఒంటెత్తు ధోరణిలో ఆలోచించినంత కాలం, జాతి మత వర్గాది సమష్టుల్లో మనిషిని భాగంగా చూచినంత కాలం, తాముతప్ప మరెవ్వరూ జగదుద్ధారకులు కారని ఆయా వర్గాలు అహంకరించినంత కాలం, భిన్న వర్గాలమధ్య విద్వేషాలు, స్పర్ధలు తప్పవు.

మానవ సమాజ చరిత్ర సుదీర్ఘమైనది. ఆ చరిత్రలో మానవుడెంతో విజ్ఞానం ఆర్జించాడు. కాని, గత మూడు నాల్గు శతాబ్దులలో ఆధునిక విజ్ఞానశాస్త్రం వేగంగా అవతరించడంతో, విజ్ఞాన స్రవంతి క్రొత్త మలుపు తిరిగింది. ఈ మలుపును

గమనించకపోతే, మనం ఎంత ఆలోచించినా పాత గొడినుంచి తొలగినట్లు కాదు.

సనాతనంగా మానవుడార్జించిన విజ్ఞానానికి ప్రధాన ఆధారం ఊహాపోహలే. అందువల్ల దానిలో ఎక్కువ లోపాలుండడానికి అవకాశం వుంది. ఆధునిక విజ్ఞానం సరళి వేరు. పరిశీలన, పరిశోధన, ప్రయోగం, మననం, సిద్ధాంతీకరణ, పునర్నిర్ధారణ ద్వారా అది ముందుకు నడుస్తుంది. అలా ఆధునిక విజ్ఞానశాస్త్రం నిర్ధారించిన అంశాలు వాస్తవిక సత్యానికి దగ్గర మదింపుగా వుంటాయి. చిరకాలంగా సత్యాలుగా చలామణి అవుతున్న అనేక అంశాలను ఆధునిక విజ్ఞానం అసత్యాలుగా నిరూపించింది.

''భూమి గుండ్రంగా గోళాకారంలో వుంది. మిగతా గ్రహాలతోపాటు సూర్యుడి చుట్టూ తిరుగుతున్నది. సూర్యుడు కూడా నక్షత్రమే. మిగతా నక్షత్రాలు కూడా సూర్యుని వంటివే. గురుత్వ ప్రభావం వల్ల ఇవి అన్నీ ఒక క్రమబద్ధమైన రీతిలో తిరుగుతున్నాయి'' అంటూ ఆధునిక విజ్ఞానం చెప్పిన అంశాలు కేవలం వూహలుకావు. సంప్రదాయికంగా మనకు వచ్చిన నమ్మకాలకు యివి భిన్నం. ఇవి అన్నీ ప్రయోగ రీత్యా, గణిత రీత్యా రుజువు చేయబడినవే.

మన చుట్టూ అనంత ప్రకృతి వుంది. ఏదైతే వున్నదో ఆ విశ్వమంతా ప్రకృతే. ఆ ప్రకృతిలో మనిషి కూడా భాగమే. దాన్ని మనిషి తెలుసుకుంటున్నాడు. మనిషి తెలుసుకోకపోయినా ప్రకృతి వుంటుంది. అంటే ప్రకృతి వునికి మన చైతన్యం మీద ఆధారపడి లేదు. నిజానికి మన చైతన్యమే ప్రకృతిపై ఆధారపడి వుంది. యీ ప్రకృతి మన జ్ఞానేంద్రియాలను తాకడంతో దాన్ని గురించిన జ్ఞానం మనకు కల్గుతున్నది. ఆ జ్ఞానంతో ప్రకృతిలోని కొన్ని సంఘటనలను కొంత మేరకు మార్చగల్గుతున్నాము. ఈ ప్రకృతిని గురించిన జ్ఞానాన్ని ఎవరు ఆర్జించినా అది ఒకే విధంగా వుంటుంది. అందువల్ల మానవులార్జించిన జ్ఞానం పరస్పరం యిచ్చి పుచ్చుకోడానికి వీలవుతుంది. ఇలా మానవుడు సంతరించుకున్న జ్ఞానం మానవుడిలో హేతుత్వం రూపొందడానికి, అది సమర్థవంతంగా పనిచేయడానికి దోహదపడుతున్నది.

మనం దేనిని ప్రకృతి అంటున్నామో, ఆ ప్రకృతి అనంత సంఘటనల మయం.ఆ సంఘటనలు అవిరతం. నిజానికి విశ్వాన్ని సంఘటనల అవిరతమనీ, స్థలకాల అవిరతమనీ అంటాం. ఈ అవిరామ సంఘటనల్లో రెండు సంఘటనల్ని విడదీసి పరిశీలిస్తే, ముందటి సంఘటన వెనుకటి సంఘటనకు కారణమైనట్లు తెలుస్తుంది. అలా ముందటి సంఘటనను కారణంగాను, వెనుకటి సంఘటనను కార్యంగాను భావించడం వల్ల ''కార్యకారణ భావన'' (Concept of Causality) యేర్పడుతున్నది. ప్రకృతి సంఘటనలన్నీ క్రమబద్ధంగాను, నియమబద్ధంగాను జరుగుతున్నందువల్ల, ఆ సంఘట నల గురించిన మన జ్ఞానం నియమబద్ధంగా తప్ప వుండడం లేదు. మన జ్ఞానంలోని ఈ నియమబద్ధతనే మనం హేతుత్వ మంటున్నాం.

ప్రకృతిలోని నియమ బద్ధతకు, అనుస్పందన అయిన హేతుత్వం జీవపరిణామ దశలో మానవుడికి లభ్యమైంది. అంటే మానవుడి హేతుత్వానికి మూలం మానవుడిలోను, మానవుడికి మూలం ప్రకృతిలోను విజ్ఞానశాస్త్రం చూస్తుంది. కాబట్టి, మానవుడిలోవున్న హేతుత్వ లక్షణం జైవికలక్షణమే కాని, దైవిక లక్షణం కాదు. ఇదే శాస్త్రవిజ్ఞానం మనముందుంచుతున్న అంశం.

అయితే యీ విషయాన్ని మన పూర్వ దార్శనికులు యిలా భావించినట్లు కన్పించదు. వారు ప్రకృతి మూలాలను ప్రకృతి వెలుపల చూడడానికి ప్రయత్నించారు. మన అనుభూతిలోకి వస్తున్న ప్రకృతిని కార్యంగా చూపి, దాని కారణం దానికి వెలుపల వుంటుందని భావించారు. ఆ కారణాన్నే వారు దైవం మొదలైన అతీత శక్తుల పేర్లతో పిలిచారు. ఇంత పెద్ద ప్రకృతికే దైవం మూలమయినపుడు, ఈ ప్రకృతిలోని శీతవాతాతపాదులకు గురిఅవుతున్న మనిషి మాత్రం దేవుడి సృష్టికాకుండా ఎలా వుండగలడని వారి తర్కం. అందుచేత ప్రకృతితోపాటు మనిషిపై కూడా ఒక అధిపతిని ఎన్నుకోక వారికి తప్పలేదు. అందుచేత మనిషి పరాధీనుడుగా భావించబడకనూ తప్పలేదు. ఫలితంగా మనిషి నిర్మించుకొన్న విలువలన్నీ దైవికాలయిపోయినవి, మానవికాలు కాలేకపోయినవి.

కాని, ఆధునిక విజ్ఞానశాస్త్రం యిందుకు భిన్నమైన రీతిలో తన అన్వేషణ కొనసాగించింది. పరిశీలన, ప్రయోగం, పరిశోధనలద్వారా ప్రకృతిని అర్థం చేసుకుంటున్నది. ప్రకృతిని అధ్యయనం చేయడమే శాస్త్రప్రవృత్తి. ఇతరమైన వాటిని అధ్యయనం చేయడం శాస్త్రం పనికాదు. అంటే, ఆధునిక విజ్ఞానశాస్త్రం ప్రకృతి మూలాలను ప్రకృతిలోనే చూస్తున్నది. సంఘటనలకు కారణాలను వాటిముందటి సంఘటనలలో చూస్తున్నది. ఆది కారణం, ఆది సంఘటన ఏమిటనే ప్రశ్న శాస్త్రంముందు రాదు. ఎందుకంటే, నీటికి కారణం ఆవిరయితే, తిరిగి ఆవిరికి కారణం నీరవుతుంది. కార్యకారణాలు రెండూ ఒకదానిలోనే ఉన్నాయి. ఒక సంఘటనను ముందుకో, వెనక్కో త్రిప్పడం వల్ల కారణమే కార్యంగానూ, కార్యం కారణంగానూ మారుతాయి. అంటే కార్యకారణాలు సంఘటనల క్రమంలో ముందువెనుక దశలేకాని, వేరుకావు. అవి కేవలం దశల భేదాలే అందువల్ల కార్యకారణాలను విడదీసి ద్వయీభావంతో చూడడాన్ని ఒక స్థాయి వరకే మనం పరిమితం చేయవలసి వుంటుంది.

ఇదంతా మనం ఎందుకు చెప్పుకోవలసి వస్తున్నదంటే, మానవుడి జీవిత విధానాన్ని అతని తాత్విక అవగాహన నడిపిస్తుంది. తత్వమంటే ప్రపంచ స్వరూపాన్ని గురించి, అందులోవున్న మానవుడి ఆస్తిత్వాన్ని గురించి, వాటి రెండింటి మధ్య వుండే సంబంధాన్ని గురించి అర్థం చేసుకోవడమే. విశ్వకారణాన్ని విశ్వానికి వెలుపల వెదకేవాడు తాత్విక అవగాహనలో మొదట్లోనే తప్పటడుగు వేశాడని అర్థం చేసుకోవడం, గ్రహించడం మానవ వాదంలో తొలిమెట్టు.

ఇక రెండవది మానవుడీ విశ్వంలోకి ఎలా వచ్చేడనే ప్రశ్న. మానవుణ్ణి దేవుడు సృష్టించాడనేది మతాలన్నీ చెప్పే సమాధానం. అదే సమాధానాన్ని భిన్న మతాలు భిన్న రీతుల్లో డొంకతిరుగుడుగా చెప్పవచ్చు. సారాంశం మాత్రం మానవుడు దేవుడి సృష్టి అని. కాని, ఆధునిక విజ్ఞానశాస్త్రం మానవుణ్ణి దేవుడు సృష్టించాడని అంగీకరించదు. అంగీకరించగలిగితే, మనకు మిగిలేది మానవవాదం కాదు, దైవవాదం.

భౌతిక ప్రకృతిని శాస్త్రబద్ధంగా అర్థం చేసుకోవడంలో మొదటి విప్లవం కోపర్నికస్ సూర్య కేంద్ర సిద్ధాంతం. ఆ తర్వాత దానికి గెలిలియో, కెప్లర్, న్యూటన్ ప్రభృతులు మరికొంత సమగ్ర వివరణలు యిచ్చారు. వాస్తవికత (Reality) అనేది భౌతికంగా తప్ప వుండడానికి వీలులేదని చెప్పిన అయిన్‌స్టయిన్ ప్రకృతిని అర్థం చేసుకోవడంలో మానవుడికి ఉన్నత స్థాయిని చేకూర్చాడు. భౌతిక రసాయన శాస్త్రాల్లో మరెందరో మహామహులు ప్రకృతి రహస్యాల నెన్నిటినో బయటకుతీసి శాస్త్రమార్గానికి పటిష్ఠత చేకూర్చారు.

జీవ ప్రకృతి విషయంలో డార్విన్ చేసిన ప్రతిపాదనలు 'మనిషిని దేవుడు సృష్టించాడన్న నమ్మకాన్ని బ్రద్దలు చేసినవి. నిరంతర పరిణామంలో వున్న భౌతిక ప్రకృతిలో ఒకానొక దశలో భూమిపై ఏకకణ జీవులు, వాటి నుండి బహుకణ జీవులు, వాటినుండి వివిధ జాతుల వృక్షాలూ, జంతువులూ, ఆ తర్వాత చివరి మెట్టులో కోతివంటి జంతువు నుండి మనిషి ప్రకృతి పరిణామ క్రమంలో అవతరించాడని డార్విన్ అనేక రుజువులు చూపడంతో, మానవ వాదానికి విప్లవాత్మకమైన అండ దొరికింది. అటు భౌతిక ప్రకృతిని, ఇటు జీవ ప్రకృతిని గురించి వివరించడంలో ఆధునిక విజ్ఞానశాస్త్రం ఘన విజయాలు సాధించింది. ఫలితంగా భౌతిక వాస్తవికవాదం, హేతువాదం, మానవవాదం విజృంభించడానికి మంచి అవకాశం దొరికింది.

వాస్తవిక సత్యాన్ని గురించి అపార్థం చేసుకున్న మనిషి, విలువలను గురించి తప్పుడు అభిప్రాయాలు యేర్పరచుకున్నాడు. అతని దృష్టిలో ప్రపంచ జ్ఞానం జ్ఞానం కాదు. బ్రహ్మజ్ఞానమే అసలైన జ్ఞానం. మారేదేదీ నిత్యం కాదనీ, నిత్యం కానిదేదీ సత్యం కాదనీ, ఏది మారదో ఆ బ్రహ్మమే సత్యమనీ మార్మికవాదంలో పడ్డాడు. కాని వాస్తవం దీనికి భిన్నంగా వుంది. నిత్యమూ మారడమే సత్యం. మారనిదేదీ వాస్తవిక జగత్తులోలేదు. నానాటికీ సత్యాన్ని వికసింపజేసుకొంటూ శాస్త్రజ్ఞానం పెంపొందుతుంది. శాస్త్రీయ సత్యమే వాస్తవిక సత్యానికి దగ్గరి మదింపు. వాస్తవికతకు వినా సత్యమేదీ లేదు.

మానవుడిలోని హేతుత్వం జ్ఞానార్జనకు దారితీస్తుంది. ఒక వస్తువును గురించి మనం ఏమేరకు జ్ఞానాన్ని ఆర్జిస్తామో, ఆమేరకు ఆ వస్తువును గురించిన సత్యం మనకు బోధపడుతుంది. ఆ విధంగా సత్యం జ్ఞానవిషయమవుతుంది.

మానవుడికి ఈ లోకంలో అనేక కష్టనష్టాలు ఎదురయ్యే మాట నిజం. అతని

సౌఖ్యానికి అవరోధాలు అనేకంగా ఎదురయ్యే మాటకూడా నిజం. వాటిని గురించిన జ్ఞానం పొంది, సత్యాన్ని గ్రహించి మనిషి వాటికి విరుగుడును కూడా తెలుసుకోగలడు. ఆ సత్యాన్ని గ్రహించిన మనిషి వాటినుంచి స్వేచ్ఛను పొందగలడు. అలా ఆకలి దప్పులు, శీతవాతాతపాదులు, రోగం మొదలైన వాటినుంచి స్వేచ్ఛ పొందగలడు. అలానే జ్ఞానార్జన ద్వారా అజ్ఞానం నుంచి స్వేచ్ఛ పొందగలడు. నిర్బంధాలు యీ లోకంలోనే వున్నాయి. వాటి కారణాలు యీ లోకంలోనే వున్నాయి. వాటిని గురించిన సత్యాన్ని తెలుసుకోవడం ద్వారా మనిషి స్వేచ్ఛను పొందగలడు.

అయితే మానవుడి సర్వంసహాశక్తిపై విశ్వాసంలేని పరాధీన మనస్కులు కష్టనష్టాల కారణాలను యీ లోకంలో చూడలేరు. ఈలోకం నుంచి పారిపోయి మోక్షాన్ని (స్వేచ్ఛను) పొందడానికి రకరకాల శారీరక, మానసిక హింసలను భరిస్తారు. ఈ లోకంలో బాధలను అనుభవిస్తే, మరో లోకంలో స్వేచ్ఛ దొరుకుతుందని భ్రమపడే వారు ఈ లోకంలో సహజంగా యెదురయ్యే బాధలతోపాటు, వ్యర్థాశతో అదనపు బాధలను కొనితెచ్చుకొంటారు.

అదే విధంగా నీతి విషయంలో కూడా సంప్రదాయ ఆస్తికులు తప్పటడుగు వేశారు. వైయక్తికంగా ముక్తిపొందే సంస్కృతికి అలవాటు పడినవారు కావడంవల్ల సామాజిక భావం వారిలో కొరవడింది. వారు ఏ దైవం కోసమో జీవిస్తారు తప్ప, తమకోసం కాని, తమవంటివారి కోసం కాని జీవించరు. అందువల్ల మోక్షాపేక్షతో వారు యే దుర్మార్గం చేసినా అవినీతి వారిని అంటదనే దుర్నీతిని (గీత) వారుపోషించారు. కాని, మోక్షం మరణానంతరం పొందేదికాదు. మరణానంతరం మిగిలేదేమీ లేదు. మరణం ప్రత్యేక వస్తువేమీ కాదు. జీవులు తమ మామూలు వ్యాపారాన్ని చేయలేని దశే మరణం. జీవించడం ఆగిపోయిన తర్వాత, ఇంకా మనిషికి మోక్షమేమిటి? సుఖమేమిటి? అందువల్ల బ్రతికివుండగా మనిషి తన సుఖశాంతులకు అవరోధాలుగా నిలిచిన అంశాలను తొలగించుకోవడమే స్వేచ్ఛ; అదే విముక్తి అన్నా, మోక్షమన్నాను.

కాని నీతి సామాజికమైనది. సమాజం మానవుడు తన సంక్షేమం కోసం సృష్టించు కున్న వ్యవస్థ. ఆ వ్యవస్థలో మానవుల మధ్య సంబంధాలు సామరస్య పూర్వకంగా వుండాలంటే, అతని ప్రవర్తనకు గీటురాయి కావాలి. ఆ గీటురాయి హేతుప్రవృత్తి. మానవుడు హేతుమంతుడు కాబట్టి, తనకూ - తన సమాజానికీ ఏది మంచో, ఏది చెడో నిర్ణయించుకోగలడు. శాస్త్ర ప్రక్రియ ద్వారా మానవుడు తనను గురించీ, ప్రకృతిని గురించీ, తనకు ప్రకృతితోవున్న సంబంధాన్ని గురించీ సరైన జ్ఞానం ఆర్జించడం ద్వారా సత్యానికి మరింత చేరువవుతాడు. కాబట్టి, అతను హేతుబద్ధంగా చేసేనీతి మరింత సమగ్రమూ, స్వచ్ఛమూ అవుతుంది.

అంటే, మానవుడు హేతుత్వం ద్వారా జ్ఞానాన్నీ,తద్వారా సత్యాన్నీ, తద్వారా స్వేచ్ఛనూ, నీతిని చేరడమనేది మానవవాదంలో ఒక క్రమం. వాటిని విలువలుగా

మానవవాదం పరిగణిస్తుంది. మానవ జీవిత రంగాలన్నింటిలోనూ ఆర్థిక-రాజకీయా జీవితాలన్నిటిలోనూ ఆ మౌలిక విలువలకు భంగం లేకుండా మానవవాద వైఖరి చూచుకుంటుంది. మానవుడి జ్ఞానానికి విజ్ఞానశాస్త్రం కొత్త మలుపు యిచ్చింది. కాబట్టి, అతని జ్ఞానం ఆధారంగా యేర్పడి పెంపొందే మానవవాద విలువలు, శాస్త్రం ఆధారంగానే, శాస్త్రీయదృక్పథం మూలంగావే నూతన రూపాన్ని పొందినాయి. అందువల్ల యీనాటి మానవవాదాన్ని మనం నవ్య మానవవాదమనీ, శాస్త్రీయ మానవవాదమనీ అంటాం.

ఇలా అన్నప్పుడూ శాస్త్రీయ మానవవాదం కాని మానవవాదం ఉన్నదా అనే ప్రశ్న వస్తుంది. ఉన్నదనే మన సమాధానం. ఎందుకంటే, మానవ వాదం కొత్త లక్షణం కాదు. ఇది అనాదిగా వున్నదే. మానవుడిపైన దైవాధిపత్యాన్నీ, పరలోకాధిపత్యాన్నీ, అతీతశక్తుల ఆధిపత్యాన్నీ తిరస్కరించే హేతువాద, నాస్తికవాద, భౌతికవాద ఆలోచన బయలుదేరినపుడే మానవవాద బీజం మొలకెత్తింది. భారతదేశంలో చార్వాకాదులు, గ్రీసులో ఎపిక్యూరియనులు అలా దైవాధికారాన్ని ధిక్కరించిన వారిలో వున్నారు. కాలగమనంలో ఆ వాదాలు అణచి వేయబడినా, యూరపులో 12వ శతాబ్దంలో ప్రారంభమై 15-16 శతాబ్దాలకు వడి పుంజుకొన్న భావ పునర్వికాసోద్యమం మానవవాద బీజాల నుంచి వుత్పన్నమైనదే. భావ బానిసత్వంమీద తిరుగుబాటు చేయడమే ఆ ఉద్యమ లక్షణం.

భావ వికాసోద్యమ ఫలితంగా యూరపు సమాజం అనేక పరిణామాలకు లోనైంది. లౌకిక మార్గంలో తాత్విక అవగాహన పెరిగింది. మానవుడి స్వేచ్ఛాపిపాస వికసించింది. ఆధునిక విజ్ఞానశాస్త్రం అవతరించింది. మనిషిపై మతం పట్టుసడలింది. రాజరికం బలహీనపడి జాతీయవాదం విజృంభించింది. పరిశ్రమలు పెరిగాయి. సాంకేతిక విజ్ఞాన భివృద్ధి పారిశ్రామిక విధానానికి అనేక మలుపులు యిచ్చింది. ఫలితంగా సామాజిక సంబంధాలలో మార్పు వచ్చింది. ప్రజాస్వామ్య భావం పాదుకొన్నది. ఆర్థిక న్యాయం కోసం సోషలిస్టు భావం బయలుదేరింది. అందులో ఒక ముఠావారి నియంతృత్వ భావనను అండచేసుకొని జాతీయవాదం ఫాసిస్టు రూపం ధరించింది. ప్రపంచ రాజ్యాలమధ్య ఉద్రిక్తతలు పెరిగాయి.

ఆత్మరక్షణ పేరుతో దేశాలు విధ్వంసక ఆయుధ సంపదను పెంపొందించుకోడానికి విజ్ఞాన శాస్త్రాన్ని వుపయోగించుకున్నాయి. యావత్ప్రపంచంలోని జీవకోటిని మొత్తాన్నీ నాశనం చేయగల మోతాదులో కొన్ని రాజ్యాలు ఆయుధశక్తిని సంపాదించుకున్నాయి. విధ్వంసం ద్వారా రక్షణ సాధ్యంకాదని గత నాల్గు దశాబ్దాలుగా మానవవాదులు చెపుతూ వచ్చిన సత్యాన్ని ఇప్పుడు అగ్రరాజ్యాలు గ్రహించినట్లు కన్పిస్తున్నది. ఇది శుభ సూచకమేకాని, మానవవాద ధోరణిని ఎలా ఆచరణలో పెట్టాలనేది వారి ముందున్న సమస్య.

ప్రజాస్వామ్యమనేది గొప్ప భావం. కాని దాన్ని చిత్తశుద్ధితో ఆచరణలో పెట్టే ప్రయత్నం చరిత్రలో యింతవరకూ జరగలేదు. కారణమేమిటి? అనేది పరిశీలించాలి.

రాజకీయమనేది పూర్తిగా అధికారంతో ముడిపడిపోయింది. అందువల్ల రాజరికంలోని పరిపాలనకూ, ప్రాతినిధ్య ప్రజాస్వామ్య మనబడే దానిద్వారా రాజకీయాధికారం సంపాదించి సాగించే పరిపాలనకూ మౌలికంగా తేడాలేకుండా పోయింది. ప్రజాస్వామ్యంలోని భావం మానవ స్వామ్యం. ప్రాతినిధ్యం ద్వారా సాగే పాక్షిక ప్రజాస్వామ్యం నిజానికి ప్రజాస్వామ్యంలోని తొలిమెట్టు. ఆ మెట్టు దాటకుండానే ప్రజాస్వామ్యం యొక్క సాఫల్య, వైఫల్యాలను గురించి ప్రస్తావించడం నిరాశావాద వైఖరి. అధిక సంఖ్యాకుల సమ్మతి ద్వారా ఒకరికి రాజకీయాధికారాన్ని దత్తత చేయడమే ప్రజాస్వామ్యంగా భావించబడినంతకాలం ఆ బరిలోకి రాజకీయ నాయకుల యిష్టాయిష్టాలు తప్ప మరేమీ రావడానికి వీలులేదు.

ప్రజాస్వామ్యమనేది కొత్త భావం కాకపోవచ్చు. కాని, పూర్వం గణతంత్రాలుగా బయలుదేరిన వాటిలో మానవ సమతాభావం లేదు. ఉన్నత వర్గాలకు మాత్రమే వాటిలో ప్రాతినిధ్య హక్కువుంది. మనదేశంలో కొన్ని జాతులవారు, కులాలవారు మనుషులుగా పరిగణించబడలేదు. దాస్యమే వారి హక్కు. అందువల్ల పూర్వకాలపు గణతంత్రాలను ఘనత కోసం మనం ప్రజాస్వామ్యాలుగా వర్ణించుకొని ప్రయోజనం లేదు.

ఆధునిక ప్రజాస్వామిక రాజ్యాల్లో జాతీయస్థాయిలో పౌరులందరికి రాజకీయ సమతాభావం వున్నది. కాని, అది మానవ సర్వసమతాభావాన్ని అందుకోలేదు. అన్ని రంగాల్లోనూ ఏకజాతీయుల్లోనే సమతాదృక్పథం కరువైంది. కాగా, సర్వమానవ సమతా భావమనేది ఆధునిక ప్రజాస్వామ్యాల్లో కొరవడింది. ఫలితంగా కొన్ని సందర్భాల్లో జాతీయోన్మాదం పరాకాష్ఠకు చేరుకొని ప్రళయాన్ని సృష్టించే పరిస్థితులేర్పడినాయి. మరో వంక వర్గోన్మాదాన్ని రెచ్చగొట్టే రాజ్యాలూ, రాజకీయ కక్షలూ యేర్పడినాయి. వేరొకవంక మతం కొత్తగా రాజకీయాల్లో ప్రవేశించి ఫండమెంటలిజం, మత పునరుజ్జీవనం ద్వారా మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నది. జాతులు, వర్గాలు, మతాలు అంతర్జాతీయ సంబంధా లేర్పరుచుకొని పరస్పర జాతి వర్గ మతాలమధ్య పోరాటానికి అంతర్జాతీయ స్వభావాన్ని కల్పిస్తున్నాయి. అంటే మానవుణ్ణి జాతి, మత వర్గాదులుగా చీల్చి, మానవ మనుగడను, సర్వమానవ సమతాభావాన్ని దుర్లభంచేసే పరిస్థితులెదురవుతున్నాయి. ఈ అపశ్రుతుల్ని అధిగమించాలంటే మనిషిని కేవలం మనిషిగా, సర్వస్వతంత్ర సత్తాకత కల్గిన వానిగా భావించే సంస్కారం వృద్ధి చెందాలి. ఆ సంస్కారం మానవుణ్ణి గురించి, అతను తన శ్రేయస్సుకోసం సృష్టించుకున్న వ్యవస్థలను గురించి శాస్త్రీయ అవగాహన పెంపొందడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

ఈనాడు, రాజకీయార్థిక ఆలోచన మనిషిని దిగ్బంధం చేస్తున్నది. సామాజిక

సంబంధాలు సామరస్యంగా జరగడానికి వీలుగా అజమాయిషీ చేయడానికి బయలుదేరిన రాజకీయం, చివరకు అధికారాన్నే తన లక్ష్యంగా పరిగణించే స్థితికి చేరుకున్నది. దాని శాస్త్రీయ ప్రతిపత్తిని ఈనాటి రాజకీయం నాశనం చేసింది. నేటి ప్రజాస్వామ్యం పేరుకు ప్రజాస్వామ్యమేకాని, పాతకాలపు రాజరికాలకు భిన్నంగా అది నిలదొక్కుకోలేదు. అధికారమే నేటి రాజకీయానికి పరమావధి అయింది. ఈనాటి నియంతృత్వ రాజకీయాలు పూర్వకాలపు రాజుల నిరంకుశత్వాలను మించిపోయినై. నేటి ప్రజాస్వామ్యంలోవున్న అంతర్గత లోపాలవల్ల, మతరూపు సంతరించుకున్న పార్టీలమధ్య పోటీని ప్రజాస్వామ్యంగా భావించడంవల్ల, పార్టీలు నాయకులకూ, నాయకులు మహానాయకులకూ లోబడి వుంటున్నందువల్ల, పార్టీలకు వెలుపలవున్న మేధావులకూ, ప్రజలకూ పరిగణన లేకుండా పోతున్నది. అంటే, ప్రజాస్వామ్యాలు మానవస్వామ్యాలుగా కాక పార్టీస్వామ్యాలుగా రాటుదేలినై. ప్రతినిధులకూ, మంత్రులకూ పాలనాధికారం పరోక్షంగానైనా దత్తమైంది. అందువల్ల ప్రతినిధులరూపంలో వున్న రాజకీయ నాయకులు పాలనాధికారులై పోయారు. చక్రవర్తులు, సామంతరాజులు, ప్రభువులుగా ఒకప్పుడున్న వర్గీకరణకు భిన్నంగా ఈనాడు పేర్లు మాత్రమే మారాయితప్ప, మౌలికంగా అందుకు భిన్నంకాని విధంగానే యీనాటి ప్రజాస్వామ్యంలో అధికార పంపిణీ జరుగుతున్నది. ఈ ధోరణిని శాస్త్రీయ పద్ధతి అంగీకరించదు. ప్రజాస్వామ్యమంటే ప్రజలు స్వాములుగా మారాలి తప్ప, ప్రజలపై స్వామ్యం, పెత్తనం మరొకరికి అప్పగించడం కూడదు. అంటే అధికార దత్తత ప్రజాస్వామ్యంలో భాగం కాదు. ప్రజలు తమ అధికారాన్ని ప్రతినిధుల పేరుతో యితరులకు దత్తత చేయడాన్నే యీనాడు ప్రజాస్వామ్య మంటున్నాం. కాని, నిజమైన ప్రజాస్వామ్యంలో అధికారం క్రిందికి దిగి, మనం ప్రజలంటున్న మనుషుల దగ్గరకు చేరుతుంది.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో లోపాలున్నప్పటికీ, దానిలో ఒక సుగుణం వున్నది. నాలుగైదు సంవత్సరాల కొకసారి ప్రతినిధుల ఎన్నిక జరుగుతుంది కాబట్టి, అయోగ్యుల్నీ, అశక్తుల్నీ ప్రాతినిధ్యావకాశం నుంచి తప్పించే అవకాశం వుంది కాబట్టి, పాలకులు కొంతలో కొంతయినా ప్రజాభిప్రాయానికి మన్ననయిస్తారు. అంటే, అవసరమనుకొన్నపుడు పాలకులను మార్చుకొనే అధికారం ప్రజల వద్ద వుంటుంది. అంటే, తాము స్వాములు కాకపోయినా, స్వాముల్ని ఎంపిక చేసుకొనే అవకాశం ప్రజలకు వుంటుంది. అలాంటి అవకాశం ప్రజలకువుంటే, తాము అనుకొన్న విధంగా సమాజంలో మార్పులు తీసుకురాలేమన్న ఆలోచనతో కొందరు రాజకీయ తత్వజ్ఞులు నియంతృత్వాన్ని ప్రతిపాదించారు. అలాంటి ప్రతిపాదనల్లో ఆచరణలోకి తొలిసారిగా వచ్చింది మార్క్సిజం. దాని నేపథ్యంలో వచ్చిన వర్గ నియంతృత్వం-పేరుకు శ్రామిక వర్గనియంతృత్వమయినా, వాస్తవానికి పార్టీ నియంతృత్వం; అది పార్టీ అధినాయకుడి నియంతృత్వంగా మారింది. దాన్నే సోషలిజమనీ, కమ్యూనిజమనీ అన్నారు. మార్క్సిన వూహలకు భిన్నంగా బలపడ్డ జాతీయవాదం కమ్యూనిష్టు నియంతృత్వాన్ని కాపీకొట్టి, కొన్ని జాతుల మనుగడకే ముప్పుతెచ్చింది. తన వాదాన్ని నేషనల్ సోషలిజంగా

వర్ణించుకొంది. వర్గోన్మాదంతో, జాతీయోన్మాదంతో సైనిక మనస్తత్వం ప్రబలింది తప్ప, ప్రపంచానికి మేలు జరుగలేదు. నిన్న మొన్నటిదాకా కష్టజీవుల ఆశల్ని పెంచిన కమ్యూనిజం క్రిందపైతం అన్ని రంగాల్లోనూ ఉత్పత్తి క్షీణించింది. సృజనాత్మక శక్తి నశించింది. విజ్ఞానం ముడుచుకుపోయింది. స్వేచ్ఛ కరువై బానిసభావం అలవాటయింది. ఫాసిజం అంతకంటె ఎక్కువ దుర్మార్గాన్ని సాధించేదేమోకాని, ఎక్కువకాలం అది బ్రతికి బట్టకట్టలేదు. అంటే, ప్రజాస్వామ్యాన్ని సరైన దిశలో మానవస్వామ్యంగా మార్చేక్రమానికి బదులుగా, తమ వ్యూహాల్లోని స్వర్గాన్ని ఆచరణలో పెట్టబూనుకుంటే, చివరకు అది నరకంగా తేలింది. హ్యూమనిస్టు వారసత్వం మానవ స్వామ్యమేకాని, ఎవరి నియంతృత్వమూ కాదు.

మనిషిని మనిషిగా పరిగణించిన ఫ్రెంచి విప్లవం స్వేచ్ఛ, సమత, సౌభ్రాతృత్వం, న్యాయం అనే ఆదర్శాలను, నినాదాలను ముందుంచుకొని బయలుదేరింది. అది మానవవాద మార్గంలో బయలుదేరింది కాబట్టే మానవహక్కుల ప్రకటన చేసింది. కాని, ఆ మానవ హక్కులన్నిటినీ కమ్యూనిజం, ఫాసిజం కాలరాచినై. మార్క్స్, ఎంగిల్స్, లెనిన్ ఏకగ్రీవంగా స్వేచ్ఛను, సమతను హేళన చేశారు. స్వేచ్ఛ, సమతల్ని ఆదర్శాలుగా గ్రహించినది ఫ్రెంచి విప్లవమైతే, వాటిని 'నిరాకరించిన మార్క్సిస్టు కమ్యూనిస్టు రాజకీయాధికారాక్రమణ విప్లవమవుతుందో, లేక విప్లవ ప్రతిఘాతమవుతుందో ఆలోచించగల బుద్ధినైశిత్యం ఒక శతాబ్దంగా కొరవడింది. అందుచేతనే హ్యూమనిస్టు స్పందనతో బయలుదేరిన మార్క్స్, యాంటీ హ్యూమనిస్టు ధోరణితో చేసిన సిద్ధాంత ప్రతిపాదనలను విశ్లేషించి విమర్శించడానికి చాలమంది మేధావులు జంకారు. కేవలం ఆర్థికతే మానవుడి వ్యాసంగాలన్నిటినీ నిర్ణయిస్తుందా? మానవుడు వర్గస్వభావానికి దాసుడా? చరిత్రను నడిపేది కేవలం ఆర్థిక పరిస్థితులేనా? గతి తర్కబద్ధంగా చరిత్ర ముందుగానే నిర్ణయమవుతుందా? 'విప్లవం' (?) అనివార్యమా? రాజ్యం ఇగిరిపోతుందా? అది జరగాలంటే కార్మికవర్గం పేరుతో నియంతృత్వం తప్పనిసరి అవసరమా? ఈ ప్రశ్నలన్నిటికీ మార్క్సిజం 'ఔను' అని సమాధానమిస్తుంది. కాని, మానవవాదం మాత్రం 'కాదు''కాదు'అని సమాధానమిస్తుంది. అంటే ప్రధానమైన మార్క్సిస్టు ప్రతిపాదనలన్నీ యాంటీ హ్యూమనిస్టు ధోరణికే దారితీసినై.

అంటే, మానవుణ్ణి వుద్ధరించాలనే లక్ష్యంతో తప్పుడు సిద్ధాంతాలను ఆచరణలో పెట్టజూచినపుడు మానవుడి అధఃపతనానికి దారితీసే ఫలితాలెదురవతాయి. గత శతాబ్దికాలంలోని రాజకీయం ఈ విషయాన్ని నిర్దిష్టంగా రుజువు చేసింది. లక్ష్యం మానవుడేకాని సిద్ధాంతం కాదు, సిద్ధాంత లక్ష్యం మానవుడు కావాలి. ఆ మానవుడు తన చర్యలకు తాను బాధ్యత వహించేవాడు కావాలి.

ప్రజలు వివేకులైనపుడే తమకు తాము స్వాములు కాగల్గుతారు. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో, తలలు లెక్కపెట్టడంతో సఫలం కాదు. ప్రజాస్వామ్యమనేది

కంపార్ట్‌మెంటల్ కాదు. రాజకీయ రంగంలో నియంత్రత్వాన్ని అమలులో పెట్టి ఆర్థిక ప్రజాస్వామ్యం సాధించాలనే అభిప్రాయం సరయినది కాదు. కమ్యూనిస్టు తరహా సోషలిజంలో సోషలిజమూ లేదు, ప్రజాస్వామ్యమూ లేదు. అస్తులన్నీ ప్రభుత్వపరం చేసుకోవడం నేషనలైజేషన్ అవుతుందికాని, సోషలైజేషన్ కాదు. కాబట్టి రష్యాలోనూ, రష్యనేతర కమ్యూనిస్టు దేశాలలోనూ ఆరచణలో పెట్టబడింది నేనషల్ సోషలిజమే, నిజానికి సోషలిజమంటే ఆస్తులు సమాజపరం కావడం. అది ఎలా సాధ్యమవుతుందనేది వేరే విషయం. ఏ ఉత్పాదక యూనిట్‌లోని శ్రామికులకు ఆ యూనిట్‌పై యాజమాన్యపు హక్కు కల్పించడంవల్ల సోషలైజేషన్ సాధించగలం. ఉత్పత్తి సాధనాలపై ఉత్పాదకుడికి యాజమాన్యం కల్పించడమంటే అదే. అదే పద్ధతిని అన్ని రంగాల్లోనూ అనుసరించవచ్చు. ఫలితంగా పెట్టుబడిదారీ విధానం వుండదు, వ్యక్తి పెట్టుబడి దారీ విధానాన్ని ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానంగా మార్చి ఆర్థిక కార్యక్రమాలను కేంద్రీకృతం చేయడంవల్లనే, వాటిని కాపాడుకోడానికి రాజకీయ అధికార కేంద్రీకరణ కోసం నియంత్రత్వాన్ని ఆశ్రయించవలసి వచ్చింది. ఈ పద్ధతినంతా మార్క్సిస్టులు సైంటిఫిక్ సోషలిజం అంటున్నారు. చారిత్రక భౌతికవాదం పేరుతో చారిత్రక సంఘటనలకు తప్పుడు అన్వయాన్ని చెప్పుకోవడంవల్ల భవిష్యత్ చరిత్రను సైతం గతి తార్కిక జాతకచక్రంలో యిమడ్చడం జరిగింది. మార్క్సిస్టు మూలసూత్రాలన్ని టిలోనూ మానవుడు మృగ్యమయ్యాడు. Man is root of mankind అన్న మార్క్సు అందుకు విరుద్ధంగా మనిషిని చారిత్రక నియతి చక్రంలో ఒక చిన్న పనిముట్టుగా మార్చివేశాడు. The free development of each is a condition for the free development of all అన్న మార్క్సు అందుకు విరుద్ధంగా మానవవ్యక్తిత్వాన్ని వర్గ సమష్టికి బలిచేశాడు. ఇదంతా ఎందుకు చెప్పుకోవలసి వస్తున్నదంటే, అవగాహనలోపంవల్ల మనం తప్పుడు సిద్ధాంత మార్గాలు, ఆచరణ మార్గాలు త్రొక్కుతామని. మానవుని కష్టాలపట్ల కేవలం ఆవేదన వుంటే చాలదు, అవగాహన వుండాలి. భూతదయ గురించి దంచి వుపన్యసించే హిందూ మతవాదులు చీమలకు బెల్లమూ, పాములకు పాలూ నివేదించినప్పటికీ, సాటి మనిషిని అస్పృశ్యుడిగా అసహ్యించుకుంటారు, పశుపక్ష్యాదులపట్ల కారుణ్యవైఖరి అవలంబించే మతస్థుడు తోటి పరమతస్థుడిపట్ల కర్కశ వైఖరిని పోషిస్తాడు. మానవతా వాదులుగా ప్రసిద్ధమైన వారు సైతం ఇలాంటి తప్పులు చేయడానికి కారణం అవగాహన లోపమే. ఆ లోపం వల్లనే పెట్టుబడిదారుడి క్రింద దోపిడికి గురయి బాధపడుతున్న శ్రామికుణ్ణి చూచి బాధపడిన సోషలిస్టు ఆర్థికవాది 'సంపదనంతా ప్రభుత్వం చేతుల్లో పెట్టుకోవడం వల్ల ఆ దోపిడిని ప్రభుత్వం చేత తాను చేయిస్తున్నా' నన్న విషయం గుర్తించిన స్పృహనే కోల్పోతాడు ఇలా యెందుకు జరుగుతున్నది? శాస్త్రీయ అవగాహన గురించి సైతం అపార్థం చేసుకొన్నందువల్లనే.

మనిషి ఎంత బలహీనుడైనా, తనకంటె బలమైన ప్రకృతిని తన వైపుకు మలచి మార్చుకోగల బలం అతనికుంది. ఆ బలాన్ని అతనికిచ్చింది అతని జ్ఞానగ్రహణశక్తి

వివేకమూ. వాటి సహాయంతోనే అతను చరిత్రను నిర్మించుకొంటూ వస్తున్నాడు. స్వేచ్ఛ అతని జీవనసారం. అతని వివేకాన్ని, స్వేచ్ఛను అణచివేసే తతంగాలు చరిత్రలో చాలా జరిగాయి. ఒక్కోసారి అలాంటి వాటికి తలవంచినా, చివరకు అతను వాటిని అధిగమిస్తూనే వచ్చాడు. అదే అభ్యుదయం. మనిషి తానే చరిత్ర నిర్మాతకానీ, చరిత్ర చేతిలో అతను కీలుబొమ్మకాదు. కాని, చరిత్రలో కొన్ని దుస్సంఘటనలు జరిగాయి, జరుగుతున్నాయి. విజ్ఞానాన్ని వ్యవస్థీకరించిన మతాలు, మార్క్సిజంవంటి లౌకికవాదాలు, మానవుడి మానసిక వికాసానికి సంకెళ్ళుగా తగులుతున్నాయి. అలాంటి వాటినుంచి విముక్తి పొందడం మానవవాద యత్నంలో ప్రధాన వ్యాసంగం. అంటే యోజనాస్వేచ్ఛ ప్రాథమికమన్న మాట.

200 సంవత్సరాలనాటి ఫ్రెంచి విప్లవవాద ఆదర్శాలను వెనక్కు నెట్టిన మార్క్సిస్టు వర్గవాదం, 70 సంవత్సరాల సోషలిస్టు ప్రయోగం తర్వాత మానవవాదాన్ని వెదుక్కుంటూ రావడం రష్యాలో మనం గమనిస్తున్నాం. ఇది ఎలా సాధ్యమైంది? మార్క్సిజం తప్పుదారిన నడచినా, మానవవాద స్పందనతో బయలుదేరింది. వర్గంద్వారానైనా దాని లక్ష్యం మానవుడే. కాన, అది డొంక తిరుగుడుగా మానవవాద మార్గానికి చేరింది. కాని, మతాలు అలాకాదు. మతాల లక్ష్యం దైవం. మత మార్గాల్లో మానవుడు సాధనమే కాని లక్ష్యం కాదు. అందువల్ల మత మార్గంలో ఎంత దూరం నడచినా, మానవవాదం అందదు. ఆ దారిలో అది దొరకదు. మానవతా ధర్మాలుగా మతాలు ప్రతిపాదించే సూత్రాలు ఆచరణలో విఫలం కావడానికి కారణం, అవి సమగ్రం కాకపోవడమే. సమగ్ర అవగాహనా ఫలితాలు కాకపోవడమే. మనిషికి సంబంధించిన ధర్మాన్ని మనిషికి వెలుపల వెదకడంలో మత జిజ్ఞాస పరాకాష్ఠనందుకుంది. దాన్ని తత్వశాస్త్రంగా భ్రమించడం కూడా పొరపాటే. సత్యదర్శనం ఈ ప్రపంచానికి సంబంధించినది. ఎంత అసమగ్రంగానైనప్పటికీ సత్యదర్శనం చేయగలవాడు మనిషే. ఈ మనిషికిప్రాధాన్యము, ప్రాథమికత యివ్వని విధానమేదీ మానవతత్వం కాబోదు.

కాబట్టి, మానవవాదం శాస్త్రీయ దృక్పథాన్ని అంటిపెట్టుకొని వుంటుంది. మన శాస్త్రజ్ఞానం ఏ మేరకు అసమగ్రమైతే, ఆ మేరకు మానవవాదం కూడా అసగ్రమవుతుంది. కాని, దృక్పథం మాత్రం శాస్త్రీయం. ఇది శాస్త్రజ్ఞానానికి ఏ మేరకు అనుకూలమో, ఆ మేరకు మతానికి ప్రతికూలం.

(ది. 14-8-1990న తెలుగు విశ్వవిద్యాలయం (హైద్రాబాదు) కళాభవన్‌లో తె.వి. ఉపాధ్యక్షులు శ్రీ సి. నారాయణ రెడ్డిగారి అధ్యక్షతన భారత హేతువాద సంఘాధ్యక్షులు శ్రీ రావిపూడి వెంకటాద్రి సమర్పించిన లిఖిత ప్రసంగం.)

. Res Ipsa Loquitur.	11. Ray has decided to conduct his own defence.

విదేశాల్లో భారతీయుల అభ్యుదయం
తృతీయ ప్రపంచ దేశాలలో శాంతి స్థాపన

— రిచర్డ్ నిక్సన్

(అమెరికా మాజీ అధ్యక్షుడు)

ఆసియా ఉపఖండంలో భారత పాకిస్తాన్‌ల మధ్య నిరంతర సంఘర్షణ తృతీయ ప్రపంచంలో విభేదాలకూ, విరోధాలకూ ఒక శోచనీయమైన ఉదాహరణగా వుంది. సోవియట్ యూనియన్ లేకపోయినా ఈ రెండు దేశాల మధ్య విరోధం అలా కొనసాగుతూనే వుంటుంది. భారతదేశం ప్రపంచంలో అన్నిటికన్న పెద్ద ప్రజాస్వామిక దేశం. సోవియట్లతో వీరికి సన్నిహిత సంబంధాలున్నాయి. పాకిస్తాన్ అమెరికాకు మిత్రదేశం. అది క్రమేణా ప్రజాస్వామ్యం దిశగా పరిణామం చెంద యత్నిస్తోంది.

ఈ రెండు దేశాలు 1947లో బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన తర్వాత, విభజనానంతరం జరిగిన కొట్లాటలలోనూ, ఈ రెండు కొత్త దేశాలమధ్య సంభవించిన రెండు యుద్ధాలలోనూ 50 లక్షలకు పైగా ప్రజలు నిహతులైనారు. సరిహద్దులపై 2,50,000 సైన్యం యుద్ధ సన్నద్ధమై దండిగా ఆయుధాలతో ఎదురు బొదురుగా నేటికీ నిలిచి వుండడం వల్ల ఈ సంఘర్షణను తృతీయ ప్రపంచంలో అస్థిరత్వానికి ప్రధానమూలంగా, మధ్య ప్రాచ్యంతో మాత్రమే పోల్చగలము.

భారతదేశంపై అందరూ ఎన్నో ఆశలు పెట్టుకొని యున్న దేశం. ఎంతో దౌర్భాగ్యం, దురవస్థ కూడా వున్న దేశం. 1999 సంవత్సరం నాటికి ఈ దేశ జనాభా 100 కోట్లు దాటుతుంది. ప్రపంచంలోని పేదలలో మూడోవంతు పేదలు ఇక్కడ వుంటారు. ఒక రంగంలో భారత దేశం గణనీయమైన ఆర్థిక ప్రగతిని సాధించింది. 1960 దశకంలో ఈ దేశం ఎంతో వివేకంతో సాంకేతిక సహాయాన్ని, ఆర్థిక సహాయాన్ని ఉపయోగించుకొని దానికి తోడుగా స్వేచ్ఛా విపణి ప్రోత్సాహకాలను జోడింపు చేసుకుంది. వ్యవసాయ రంగంకనీవినీ ఎరుగనంతటి ఉత్పత్తితో దీనికి తోడై నిలిచింది. ఇప్పుడు భారతదేశం తన 80 కోట్ల జనాభాకు తిండి పెట్టగలిగే విధంగా చాలినంత ధాన్యాన్ని పండించగలుగుతూ వుంది. ఇంకా కొంత ధాన్యం మిగిలిపోయి ఎగుమతి చేసే స్థితికి కూడా చేరుకుంది. వివేకపూరితమైన ప్రభుత్వ విధానాలు సమర్థులైన ప్రజల శక్తి యుక్తులను వెలికిగొని వచ్చి, పరిష్కరింప వీలు లేని సమస్య అని ఎందరో భావించిన దానిని పరిష్కరించ గలుగవచ్చు అని చెప్పడానికి ఇది చక్కని దృష్టాంతం. తక్కిన దేశాలకు ఉత్తేజం కలుగజేసే ఉదాహరణ ఇది.

1960 దశకంలో భారతదేశం సాధించిన విజయాలనుండి తక్కిన తృతీయ ప్రపంచం ఎన్నో గుణపాఠాలు నేర్చుకో

ష్ట. 1970 దశకంలో 1980 దశకంలో
గుతదేశం పొందిన వైఫల్యాలనుండి
తీయ ప్రపంచం నేర్చుకోవలసిన గుణ
ాలు కూడా ఎన్నో వున్నాయి. 1960
కంలో ఆశాజనకమైన పారిశ్రామిక
ాది ఒకటి ఏర్పడింది, పెంపొందింది.
అనేక తృతీయ ప్రపంచదేశాల ఆర్థిక
స్థల జీవశక్తిని పీల్చి పిప్పి చేసేటటు
టి ప్రభుత్వ అధికార వర్గం అంతకన్న
ంగా పెంపొందింది. చైనావారివలె,
ిన్ దేశీయులవలె స్వదేశం విడిచివె
న భారతీయులు కూడా, చొరవ తీసు
ి కష్టపడి పనిచేసే సద్గుణాన్ని నిరు
హ పరచనట్టి అమెరికావంటి దేశంలో
గుపడతారు. సంపత్సమృద్ధులు
స్తారు. అమెరికాకు వలస వచ్చి స్థిరప
న సగటు భారతీయుడు ఒక సగటు
రికన్ కన్న ఎక్కువ ఆదాయం కలిగి
టున్నాడు. కాని భారతదేశంలో
త్రం వ్యక్తిగతంగా భారతీయుల
ంసనీయమైనట్టి శ్రమశక్తి కూడా అమి
మైన ప్రభుత్వ నియమ నిబంధనల వల్ల
ియ వ్యాపార సంరక్షణ తత్వంవల్ల
ని తిరగకుండ చేయబడే ఆర్థిక వ్యవ
వృథా అవుతోంది.

మ్మశక్యం కాని అడ్డంకులు ఎన్నో
ప్పటికీ, భారతదేశంలో ఇప్పటికీ
తీయ ప్రపంచపు పరిమిత హద్దులలో
ుతూ వున్న ప్రజాస్వామ్యాలలో ఒక
జాస్వామ్య వ్యవస్థ నెలకొని వుండడం
న్న విశేషం. అది భారతదేశ ప్రతిష్ఠను
ుమడింపజేసే అంశం.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం
చినప్పుడు దాని జనాభా 40 కోట్లకు
కొంచెం ఎక్కువ మాత్రమే. వారిలో
హిందువులు 25 కోట్లమంది; ముస్లిములు
9 కోట్లమంది; సిక్కులు 60 లక్షలు
మంది; బౌద్ధులు, క్రైస్తవులు లక్షల కొలది
వున్నారు. 500 మంది స్వతంత్రులైన
సంస్థానాధీశులు, మహారాజులు వున్నారు.
23 ప్రధాన భాషలు, 200 మాండలిక
భేదాలు ఉన్నాయి. 3,000 కులాలు
న్నాయి. ఈ కుప్పకు అట్టడుగున 6
కోట్ల మంది అంటరానివారు' ఉండే
వారు.

జవహర్‌లాల్ నెహ్రూతో ఆయన
తర్వాత అధికారానికి వచ్చిన వారితో
మనకెటువంటి విభేదాలున్నప్పటికీ,
కొద్ది కాలంపాటు శ్రీమతి గాంధి సైనిక
శాసనం ఎమర్జెన్సీ మినహాయిస్తే తక్కిన
కాలంలో ఇటువంటి విభిన్నతలున్న
దేశాన్ని ప్రజాస్వామిక ప్రభుత్వంతో పరి
పాలించడం ఇరవయ్యో శతాబ్ది రాజకీయ
అద్భుత కార్యాలలో గొప్ప అద్భుతమని
చెప్పవలసి వుంటుంది. ఈ సందర్భంలో
మత బోధచేసే స్త్రీని గూర్చి డా.
జాన్సన్ చేసిన సుప్రసిద్ధమైన వ్యాఖ్య
గుర్తుకొస్తుంది. ''ఇది వెనుక కాళ్ళపై
నడిచే కుక్క వంటి పని. అది ఆ పని
బాగాచేయలేదు. కాని అది అలా చేయగ
లుగుతున్నందుకు మీరు ఆశ్చర్యపో
తారు.'' భారతదేశం సరిగా పరిపాలింపబ
డటం లేదని అనుకునేవారు అది అసలు
పరిపాలింపబడటమే ఒక అద్భుత విశేష
మని గుర్తుంచుకోవాలి.

పాకిస్తాన్ కూడా స్వతంత్రమైన 30
ఏళ్ళ కాలంలో రాజకీయ. ఆర్థిక కలహాల
వల్ల ఎన్నో ఇక్కట్లకు గురి అయింది.

దెబ్బతిన్నది. 1977 నుంచే ఈ దేశానికి అధ్యక్షుడు జియాఉల్ హక్ నాయకుడు. అతడు సంగతి సందర్భాలెరిగిన సైనిక నాయకుడు. దేశ ఆర్థికాభివృద్ధికి అవసరమైన రాజకీయ సుస్థిరతను సమకూర్చాడు. అతడు తన ప్రజల ప్రజాస్వామిక ఆశయాలను. వాంఛలను గుర్తిస్తున్నాడు. క్రమేపీ ప్రజాస్వామికీకరణమనే ఒక కార్య ప్రక్రియను అతడు అమలు జరిపాడు. అది రాజకీయ హింస వల్లగాని, అఫ్గనిస్తాన్ ద్వారా సోవియట్ వత్తిడి వల్లగాని నిష్ఫలం చేయబడకపోయినట్లయితే 1990లో మరొక వరుస స్వేచ్ఛాయుత ఎన్నికలకు దారితీయగలదు. (ఈ వ్యాసం జియా మృతికి ముందుగానే వ్రాయబడింది. — సంపా.

సాంప్రదాయికంగా పాకిస్తాన్-అమెరికాకు మిత్ర రాజ్యంగా ఉంటూ వస్తున్నది. భారతదేశ విదేశాంగ విధానం సోవియట్ యూనియన్ వైపు మొగ్గు కలిగి వున్నది. దక్షిణ ఆసియా లోపలికి సోవియట్ విస్తరణ జరగకుండా పాకిస్తాన్ నేడు అగ్ర భాగపు శ్రేణిగా నిలిచి వుంది. అది ఆఫ్గన్ స్వాతంత్ర్య యోధులకు మద్దతు ఇస్తోంది. 30 లక్షలకు పైగా శరణార్థులకు ఆశ్రయమిచ్చి వారికి ఆహారం, వసతి సమకూరుస్తోంది. సాహసోపేతమైన ఈ విధానాలు ప్రాణాపాయకరమైనవి. ప్రతీకారంగా సోవియట్ విమానాలు ఒక 1986 సంవత్సరంలోనే ఎన్నోమార్లు పాకిస్తాన్‌పై దాడులు జరిపాయి. 1987లో ఈ దాడుల సంఖ్య హెచ్చింది. భీతికలుగజేసే బాంబింగులతో, జాతుల మధ్య కలహాలను రాజబెడుతూ పాకిస్తాన్‌లో అస్థిర పరిస్థితులు కల్పించడానికి సోవియట్ ఏజెంట్లు ప్రయత్నిస్తున్నారు.

భారత్ వంటి ప్రజాస్వామిక దేశం కమ్యూనిస్టులకు అనుకూలమైన విదేశాంగ విధానం కలిగి వుండడమనేది ఈ శతాబ్ది భౌగోళ-రాజకీయ విరోధ భాగాలలో ఒకటని చెప్పాలి. ఆఫ్ఘనిస్తాన్‌పై సోవియట్ దండ యాత్రను ఖండించనట్టి కమ్యూనిస్టేతరమైన పెద్ద దేశం అది ఒక్కటే. కాబూల్‌తో పూర్తి దౌత్య సంబంధాలున్న కొద్ది దేశాలలో కూడా అదొకటి. నామ్‌పెన్‌లో రాయబార కార్యాలయమున్న కమ్యూనిస్టేతర దేశం అదొక్కటే. దానికి సోవియట్ యూనియన్‌తో విస్తృతమైన సైనిక, ఆర్థిక సంబంధాలున్నాయి. సోవియట్లు దాదాపు అన్ని స్థాయిలలో భారతీయ పబ్లిక్, ప్రైవేటు ఆర్థిక వ్యవస్థలతో నేరుగా వ్యవహారాలు, లావాదేవీలు జరుపుతూ వుంటారు. భారతీయ రాజకీయ నాయకులకు చందాలు, విరాళాలు కూడ ఇస్తూ వుంటారు. 1985లో భారతదేశం ఐక్యరాజ్య సమితిలో అమెరికాను 8.1 శాతం కాలం మాత్రమే సమర్థించింది. అంటే కమ్యూనిస్టు మంగోలియా కంటే తక్కువగానే సమర్థించింది.

దురాక్రమణదారుగా ఎంచి పాకిస్తాన్‌కు భారతదేశం ఎందుకు భయపడుతూ వుందో బోధపరచుకోవడం కష్టంగా వుంది. భారతదేశ జనాభా 80 కోట్లు పాకిస్తాన్ జనాభా 10 కోట్లకు కొంచెం పైగా మాత్రమే. పాకిస్తాన్ కన్న రెండు రెట్లు యుద్ధ విమానాలు భారతదేశానికి వున్నాయి. ప్రపంచంలో నాల్గవ స్థానానికి వచ్చే సాంప్రదాయిక సైన్యం భారతదేశ

ఉ వుంది. పాకిస్తాన్ సైన్యం 13వ
నంలో వుంటుంది. తన విరోధికి అమె
కా సైనిక సహాయం చేయడం భారతదే
శానికి ఆదుర్దా కలిగిస్తుంది. గడచిన
మూడేళ్ళలో పాకిస్తాన్ మన నుంచి
పొందిన ఆయుధాల కంటే రెండు రెట్లు
ఆయుధాలను సోవియట్లు భారతదేశానికి
సప్లై చేశారు. భారతదేశం 1974లో
ఒ అణు సాధనాన్ని పేల్చింది. కాని
ప్పుడది పాకిస్తాన్ అణుశక్తి కార్యక్రమా
ని చాలా బిగ్గరగా అభ్యంతరం తెలుపు
ంది. అధ్యక్షుడు జియా వాటిని అమి
ోత్పాదన జరుగకుండా ఒక ఒప్పం
ంపై సంతకాలు చేద్దామని పలుమార్లు
ప్రతిపాదించాడు. భారతదేశం దానిని తిర
స్కరించింది.

దక్షిణాసియాకు వెలుపలి నుంచి రాగల
ఒ పెద్ద ప్రమాదం సోవియట్ విస్తరణ
వాదం. పాకిస్తాన్ దేశీయులకు ఇది
తెలుసు. కొందరు భారతీయ అధికార్లు,
వ్యాపారస్తులు, పత్రికా విలేఖర్లు పశ్చిమ
దేశాలకేసి చూస్తూ, ఉత్తరం వైపు మొగ్గు
చూపే భారతదేశ విధానం పట్ల ఆదుర్దా
వ్యక్తం చేయ నారంభించారు. భారతీ
యులు భల్లూకం తమను గాయపరచ
నంత వరకు మాత్రమే దానితో మసలుకో
గలరు.

ఈ రెండు దేశాలకూ ఆంతరంగికంగా
పెద్ద ప్రమాదం ఆర్థిక స్తబ్ధతవల్ల సంప్రాప్త
మవుతుంది. అది వాటి రాజకీయ సుస్థిర
త్వాన్ని తొలిచివేయగలదు. పేదరికం
జాతుల మధ్య వైమనస్యాలను రెచ్చగొ
డుతుంది. వాటివల్ల భారత జాతి దుర్బల
మవుతుంది. అలాగే పేదరికం ప్రజాస్వా
మికానికి మారాలని పాకిస్తాన్ చేసే ప్రయ
త్నాలను నిష్ఫలం చేయగలదు. ప్రపం
చంలో అతి పేద దేశాలు రెండు పర
స్పరం ఒకరిపై ఒకరు ఉపయోగించడానికై
ఏటా 800 కోట్ల డాలర్లు ఆయుధాలపై
ఖర్చు పెట్టడం అసభ్యకరమైన విషయం.
ఈ ఉభయ దేశాలలోని బలవంతులైన
రాజనీతిజ్ఞులు ఒకరిపట్ల ఒకరు శాంతిని
ప్రకటించి వారి దేశాలను కష్టాలకు లోను
చేస్తూ వున్నట్టి పేదరికంపై యుద్ధం
ప్రకటించడం ఎప్పుడో జరిగి వుండవల
సింది.

అరబ్-ఇజ్రాయెల్ సంఘర్షణ 40
ఏళ్ళ నుంచీ జరుగుతూ వున్న యుద్ధం.
ఆర్థికాభివృద్ధికి ఎంతగానో అవసరమైన
లెక్కలేని వనరులను అది వ్యర్థం చేస్తూ
వుంది. మధ్యప్రాచ్యంలో సోవియట్
యూనియన్ ఏ విధమైన పాత్ర నిర్వర్తిం
చక పోయినా ఆ సంఘర్షణ అలాగే
వుంటుంది. కాని క్రెమ్లిన్ నాయకులు ఆ
ప్రాంతంలో మన ప్రయోజనాలకు హాని
కలిగించి దానిని తమ స్వార్థానికి ఉపయో
గించు కున్నారు. మధ్య ప్రాచ్యం తృతీయ
ప్రపంచంలో ఒక భాగం. సుస్థిరత్వాన్నీ,
శాంతినీ వర్ధిల్లజేయడానికి అక్కడ అమె
రికా యొక్క క్రియాశీలక ప్రమేయం
తప్పనిసరి అవుతుంది.

అరబ్-ఇజ్రాయల్ సంఘర్షణతో
ప్రత్యక్ష ప్రమేయమున్న దేశాలలో ఏ
ఒక్క దేశం కూడా దాని ప్రజలకు ఉన్నత
జీవన ప్రమాణాన్ని సాధించలేక
పోయింది. పలు దేశాలలో బ్రహ్మాండమైన
ఋణగ్రస్తత, పెద్ద జనాభా పెరుగుదల
అనే జంట సంక్షోభాలు కలిగి వాటిని

క్రుంగదీస్తున్నాయి. అయినా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత పాలస్తీనా విభజన జరిగిన నాటి నుంచీ ఇజ్రాయిలీలు, అరబ్బులు 1948లో, 1965లో, 1967లో, 1973లో, 1982లో అయిదు పూర్తి ప్రమాణపు యుద్ధాలలో, పోరాటం సల్పారు. తదాదిగా చిన్నపాటి దొమ్మీ పోరులూ, తత్సంబంధమైన సైనిక సంఘటనలూ జరుగుతూనే వచ్చాయి. ప్రపంచంలో చాలా దేశాలు వాటివాటి సైనిక వ్యయాలను స్థూల జాతీయోత్పత్తి (జి.ఎన్.పి) యొక్క శాతాన్ని బట్టి లెక్క కట్టుతారు. అయితే అరబ్-ఇజ్రాయిలి యుద్ధాలలో ప్రమేయమున్న దేశాల సైనిక వ్యయాన్ని వాటివాటి జి.ఎన్.పి.ల గుణిజాలలో లెక్కకట్టవచ్చు.

మధ్య ప్రాచ్యంలో సంఘర్షణకు ఒక పరిష్కారాన్ని కుదర్చడంలో అమెరికా ఒక నిర్మాణాత్మక పాత్ర వహించ వచ్చు. అలా వహించాలి కూడా. హెన్రీ కిసింజర్ అన్నట్లు మధ్య ప్రాచ్యంలోని దేశాలు యుద్ధం చేయడానికి సోవియట్ యూనియన్ సహాయ పడగలదు. కాని అవి శాంతి చేసుకోవడానికి సహాయపడే దేశం ఒక్క అమెరికాయే. ఈ ప్రాంతంలో గడచిన 40 ఏళ్ళలో మనం చాలా సాధించాము. 1948 నుంచి ఇజ్రాయిల్ రాజ్యం మనగలుగడానికి మనం గ్యారంటీ ఇచ్చాము. అచ్చటి సంఘర్షణ న్యాయబద్ధంగా పరిష్కారం కావాలని తీయకుండా వత్తిడి తెస్తూ ఉన్న వాళ్ళమూ మనమే. మనం ఒక్కళ్ళమే.

యుద్ధానంతర కాలంలో అమెరికా దౌత్య విషయకంగా సాధించిన మహత్కార్యాలలో అధ్యక్షుడు కార్టర్ సంప్రదింపులు జరిపి కుదిర్చిన క్యాంప్ డేవిడ్ ఒప్పందం చెప్పుకోదగింది. అది ఇజ్రాయిల్-ఈజిప్టుల మధ్య 1978లో శాంతిని నెలకొల్పింది. కాని మనం యీ రికార్డు చూచుకొని అంతటితో సంతృప్తి చెంది ఊరకుండ రాదు. మనం శాంతిని ప్రవర్తిల్ల జేయడంలో విఫలులమైనామా, తమ లక్ష్యాలను యుద్ధం ద్వారా సాధింప నభిలషించే ఇతరులకు ప్రోత్సాహమిచ్చిన వారమవుతాము.

— ఆనంద్

"భూతి దేహమందు పూనిన నయ్యేనే
నిష్ఠ శివునియందు నిలువవలయు
గాక భస్మమందు గాడిదె పొర్లదా...."

— వేమన

సద్దాం హుస్సేన్
(కుటుంబ కథ)

కొన్ని ఏళ్ల కిందట.. ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ 45వ జన్మదినం సందర్భంలో.... అతడి ఇల్లాలు సజ్జీదా ఒక విందు చేసింది. రాజధాని బాగ్దాద్‌లో ఉన్న 200మంది చాలా ముఖ్యమైన మహిళలు వచ్చారు. వారిలో దౌత్యాధికారుల భార్యలు, అధికార ప్రముఖుల భార్యలు కూడా ఉన్నారు. అందరూ కలసి సద్దాం హుస్సేన్ పుట్టిన రోజును తగు రీతిలో చేయడం ఆ సందర్భానికి ముఖ్యం.

అదే జరిగింది. ఇద్దరు యువతులు పాప రూపంలో అమర్చిన మైనపువత్తుల కాగడాలను పట్టి చెరో వైపునా నడుస్తున్నారు. వారి మధ్యన ఒక తరుణి సద్దాం హుసేన్ పేరిట చలామణీ అవుతున్న "టీ-షర్ట్" ధరించి వస్తున్నది. ఆమె వెనక చాలా పెద్ద కేక్, దాని పైన మైనపువత్తులు, వెనక యువతులు, ...ఆ యువతీ బృందం యావత్తూ చప్పట్లు చరుస్తూ, పాడుతూ.... 'హాయలు మీరిన ఉత్సవాల!

పుట్టిన రోజు పండుగకి వచ్చిన ఒక ఇరాకీ అధికారి పాశ్చాత్య భార్య ఇదంతా చూసి "ఈ ఘోష చూసి శ్రీమతి సజ్జీదా ఏమనుకున్నదో చెప్పలేను కానీ, ఇట్లా మా శ్రీవారి పుట్టిన రోజున చేస్తే మాత్రం, ఆయన నేను 'అతి'గా మోజు చూపానని తప్పక అనేవాడు" అన్నది.

ఎవరి భావాలు వారికి ఉంటాయను కోండి. సజ్జీదా మాత్రం తన భావాలను పైకి ఉబకనీయలేదు. ఈ ఉత్సవాతిశయానికి తన వంతు ఉత్సాహాన్ని సమకూర్చింది. సద్దాంతో ఆమె పెళ్ళి జరిగి దాదాపు ముప్పది ఏళ్లు అయింది. భర్తకు గల స్వాతిశయం బాణీ ఆమెకు బాగా విదితమే.

అతడు ప్రసిద్ధ పురుషుడుగా, ప్రపంచంలోని వార్తా పత్రికలన్నిటిలో తరుచు ప్రాధాన్యం పొందుతూ ఉంటాడు. ఆమె మాత్రం ఛాయా మాత్రంగా అతడి వెంట ఉంటుంది. ఆమెకు, అతడికి ఉన్న జనాకర్షణశక్తిగానీ, ప్రగల్భంగానీ లేవు; అది అందరు ఎరిగిన మాట.

అధ్యక్షుని ఇల్లాలు ఇట్లా ఉండాలి అని ఆమెను ఆదర్శంగా ఊహిస్తారు ఇరాకీ ప్రజలు. ఆమె పట్ల వారికి గౌరవభావం ఉంది. ఆమెకు వ్యతిరేకంగా అక్కడ ఏ పత్రికా వ్రాయదు. దేశ బహిష్కృతుడైన వ్యక్తి గూడా ఇదే మాట అంటాడు. ఆ మాట కొస్తే, అసలు ఆమెను గురించిన వార్తగానీ విశేషంగానీ, ఇరాకీ పత్రికలలో కానరాదు.

బాగ్దాద్‌లో ఒక సైనిక ప్రదర్శనా లయం ఉంది. దీనిలో ఎక్కువ, సద్దం హుసేన్ ఫోటోలే. ఫోటోలలో సద్దం జీవితం. అన్ని ఫోటోలలో రెండింటిలో మాత్రమే సజ్జీదా కానవస్తుంది. ఒకటి వాళ్ళ పెళ్లి నాటిది. మరొకటి అల్‌మరా అనే పత్రిక 1978లో ప్రచురించిన 'అధ్యక్షుని కుటుంబం'' --దానిలో ఆమె ఎట్లాగూ ఉండవలసినదే. అన్నట్లు పత్రికలో ఆ కుటుంబ ప్రాధాన్యాన్ని గురించి సద్దం హుసేన్ ప్రవచించిన ఈ భావాలు కూడా ప్రచురితమైనాయి. ''పెళ్లి వ్యవస్థలో ముఖ్యం ఏమిటంటే, తనను అణగారుస్తున్నారని మహిళ అనుకునేటట్లు మగవాడు ప్రవర్తించరాదు. అతడు మగవాడు అయినందువలన, ఆమె ఆడది అయినదంత మాత్రాన అట్లాంటి భావనకు అవకాశం కల్పించరాదు. ఆమె తనను తక్కువగా చూస్తున్నాడు అని అనుకున్నదో, ఆ కుటుంబ జీవితం ఖతం అయినట్లే.''

ఆ పత్రిక ఇరాకీ మహిళా సమాఖ్య పత్రిక. దానికి ప్రభుత్వ మద్దతు ఉన్నది.

సద్దం హుసేన్ ఏవేవో మంచి ఆదర్శాలే చెప్తున్నాడు. కానీ, ఇరాకీ విమాన యాన సంస్థ మాజీ అధ్యక్షుని భార్య సమీరా పెదెవ్ షాహిబందర్‌తో సద్దంకు చాలాకాలంగా సంబంధం ఉన్నందువలన, కుటుంబ జీవితం కొంత కలత చెందింది. సద్దం హుసేన్‌కు స్త్రీలోలత్వం ఉన్న సంగతి సర్వ విదితమే. కానీ సమీరాతో నెలకొన్న ఈ అనుబంధం పట్ల సజ్జీదాకు క్రోధం కలిగింది.

సద్దంకు చాలా ఆప్త స్నేహితుడు కమేల్ హానా జాజ్జూ. అతడే సద్దంకు సమీరాను పరిచయం చేసిన వ్యక్తి. సద్దం పెద్ద కుమారుడు ఉడాయ్‌కి, కమేల్ కుమార్తెను యిచ్చి యీ సంబధం పట్ల ఏవగింపు కలిగిన కమేల్‌ను 1988 నవంబర్‌లో కొట్టి చంపాడు. ఉడాయ్‌కి కొట్టి చంపడంలో అప్పటికే అనుభవం ఉంది. ఒక యువతితో రాత్రి క్లబ్బులో నాట్యం చేయాలని విఫల యత్నం చేశాడు ఉడాయ్; అంతే, సైన్యంలో పనిచేసే ఆమె భర్తను చంపేశాడు. ఒక విద్యార్థినిని లేవదీసుకు పోవడానికి మరొక విఫలయత్నం చేసి, ఆమె తండ్రిని, అతడూ సైన్యంలో అధికారే, చంపివేశాడు. ఉడాయ్‌ని అరెస్టుచేసి, విచారణకు పెట్టాలని సద్దం ఆదేశించాడు. సజ్జీదా అందుకు ఒప్పుకోలేదు. కానీ, అయినా ఉడాయ్ చెరసాలలో పడ్డాడు.

కొద్ది కాలానికి సద్దం మెత్తపడి, కొడుకును విడుదల చేయించి, దేశం నుంచి వెళ్లి పొమ్మన్నాడు. ఉడాయ్ వెంటనే జెనీవా (స్విట్జర్లాండ్)కు వెళ్లాడు. కొన్ని వారాలలో అక్కడ ఒకడిని కొట్టాడు. వాళ్లు వెళ్లగొట్టారు.. అప్పటికి అతడి వయస్సు 27 సంవత్సరాలు. స్వదేశానికి తిరిగి వచ్చి, తండ్రి మంచిని మళ్లీ సంపాదించి, యువజన సమాఖ్యకు నాయకుడుగా, దేశ క్రీడా మండలికి అధ్యక్షుడుగా నియుక్తుడైనాడు.

సజ్జీదా పరిస్థితి ఏమీ మెరుగు కాలేదు. పైగా మరింత దిగజారుతున్నట్లు వుంది. సమీరా మూలంగా తన చెల్లెలు అవమానాలు పాలయి పోతున్నదని సజ్జీదా అన్న ఇరాక్ రక్షణ మంత్రి (బావమరది) జనరల్ అద్నాన్ ఖైరుల్లా తల పోశాడు.

ఉ మే 1989లో హతుడ్డైనాడు. అతడి
; సద్దం ఆజ్ఞమేరకే జరిగిందంటారు.

ఏది ఏమైనా సద్దం సజ్జీదాల దాంపత్యం
శ తేలికగా అంతమయ్యేది కాదు. వారి
హబంధం వారి చిన్ననాటిది, గట్టిది.
ప్పుడు వాళ్ళిద్దరూ ఒకే చోట పెరి
ఖ. మధ్య ఇరాక్‌లో తాక్రిత్
ములో అక్కడ సజ్జీదా తండ్రి
ళ్లా తాల్వా ఉపాధ్యాయుడు. సద్దం
ఢి అతడి చిన్ననాడే మరణించాడు.
మఖైరుల్లా అతడిని పెంచి చదువు
ంచాడు. ఆచారం ప్రకారం 'సద్దం,
శాలకు చిన్నప్పుడే నిశ్చితార్థం
డు తాతగారు. ఆ తర్వాత కొంత
నికి రాజకీయాలవలన ఈజిప్టుకు పారి
ూడు సద్దం. 1960లో తిరిగివచ్చి
ాను పెళ్లి చేసుకున్నాడు. అప్పటికే
ఉపాధ్యాయిని. ఒక ప్రాథమిక పాఠశా
ా పాఠాలు చెప్తూ ఉండేది. ఆ
్యోగం కొనసాగించింది. ఐదుగురు
ానం. ఇంట్లో ఒక నర్సు ఉండేది,
ా సంతానాన్ని సజ్జీదా లేనప్పుడు
తూ ఉండడానికి. సజ్జీదా ఉద్యోగం
ుడం సద్దంకు ఇష్టమే. స్త్రీలు పురుషు
ా పాటు చదువుకొని ఉద్యోగాలు
ూలని అతడి అభిమతం.

ప్పుడు ఆమె ప్రధానోపాధ్యాయిని.
ఒ భార్య అయినందువలన ప్రధానోపా
ధ్యాయిని అయినదనుకోరాదనీ, ఆమె
ద్యోగ కాలాన్ని బట్టి పదవి పెరిగిందనీ,
ఠ భత్యాలూ, విధి నిర్వహణ పద్ధ
ఱూ అన్నీ మామూలేనని సద్దం
స్తాడు. ఆమె వయస్సు ఇప్పుడు 55
ఏళ్ళు దాటినా, ఆమె అంతకంటే చిన్నది
గానే కనపడ్తూ ఉంటుంది. కాకపోతే ఆమె
నల్లజుట్టు, కొంచెం తెల్లబడుతున్నది.
పాశ్చాత్య స్త్రీవలెనే దుస్తులు ధరిస్తూ
ఉంటుంది. ఈ మధ్య హుసేన్
కుటుంబం వారు ఉత్తర ఇరాక్‌లో ఒక
పర్వతప్రాంతంలో కొన్నాళ్లు సరదాగా
గడిపారు. ఇరాక్ దూరదర్శన్‌లో వీళ్లను
చూపెట్టారు. సజ్జీదా అప్పుడు స్థానికు
లతో ఏదో ముచ్చటిస్తున్నది. పాశ్చాత్య
దుస్తులలోనే ఉంది. ఫర్‌కోటు ధరించి
ఉంది.

1981 ప్రాంతంలో ఆయన జీవిత
చరిత్రను అధికార పూర్వకంగా ప్రచురిం
చారు. దానిలో అతడికి కుటుంబం పట్ల
గల ఆత్మీయానుబంధాలను వివరిం
చారు. తన సంతానానికి సద్దం రాత్రి నిద్ర
పోవడానికి చెప్పిన కథలనూ, అందరూ
కలసి ఏదైనా కొనుక్కోనడానికి వెళ్లిన
ప్పుడు జరిగిన సన్నివేశాలనూ వివరిం
చారు. సద్దంతో కలసి సజ్జీదా ఒక "రైతు
నివాసాన్ని" సందర్శిస్తున్న దృశ్యం
'ఫోటో' దీనిలో చేర్చారు. సంతానంతో
ఒక నదిలో స్నానం చేస్తున్న సద్దం మరొక
ఫోటో. సంతానంతో అతడు మోటారు
బోటులో విహరించడం, ఒక కూతురు
డ్రస్సులో ఊడిన గుండీలను కుట్టుతున్న
సద్దం... ఇతర దృశ్యాలు.

హుసేన్ దంపతుల సంతానం;
కుమార్తె రగాద్‌కు 24 ఏళ్లు. మరో
కుమార్తె రానా వయస్సు 19 ఏళ్లు.
యింకో కుమార్తె మాలా వయస్సు 16
ఏళ్లు. కుమారుడు ఖుసీ వయస్సు 25
ఏళ్లు. ఉడాయ్ వయస్సు 26 ఏళ్లు.

ఉడాయ్‌ని అతడి 16వ ఏటనే ఒక జీవిత చరిత్ర రచయిత కలుసుకున్నాడు. ముందుముందు ఏమి చేయాలని, ఆశిస్తున్నావు అని రచయిత అడుగగా ఉడాయ్ ఇట్లా చెప్పాడు. ''ఇరాక్‌కు కావలసినది అణు విజ్ఞానులు. ఇరాక్ అణుశక్తి దేశాల బృందంలో చేరాలి వెంటనే ఆ విజ్ఞానులు కావాలి'' ఆపైన అతడే సైనిక శిక్షణను గురించి మాట్లాడుతూ ''ప్రతి ఇరాక్ యువకుడూ సైనిక శిక్షణ పొంది, సర్వదా సన్నద్ధుడుగా ఉండాలి'' అని అప్పుడే చెప్పాడు.

సంతానంలో పెద్ద కుమార్తెలు ఇద్దరినీ ఇద్దరు అన్నదమ్ములకు ఇచ్చి పెళ్లి చేశారు. వారిలో ఒకడు ''పరిశ్రమలు, రక్షణ పరికరాలు'' శాఖామంత్రి. రెండో వాడు సైన్యంలో కెప్టెన్.

ఉడాయ్ భార్య ఇరాక్. దేశ ఉపాధ్యక్షుని కుమార్తె. సజ్జీదాహుసేన్ ఉపాధ్యాయ వృత్తితోపాటు, ఇరాక్ సాంస్కృతిక కార్యక్రమాలలో ఆసక్తి వహిస్తూ ఉంటుంది. ప్రతి ఏప్రిల్ 28న భర్త పుట్టినరోజు పండుగ చేయాలి, చేయించాలి. ఆ రోజు చిత్రకారులు ఫోటోగ్రాఫర్లనేకులు సద్దం హుసేన్ ఫోటోలు చిత్రాలు తీస్తారు. రకరకాల ఫోటోలు! ఎన్నో! వెంటనే వాళ్ళకు ప్రతిఫలంగా ఒక చెక్కు ముట్ట చెప్తారు. కానీ తాము ఇచ్చిన చిత్రాలు ఫోటోలు బహుకరణలనీ, వాటికి ప్రతిఫలం తీసుకోబోము అనీ వాళ్ళు చెక్కులు తిప్పి పంపిస్తారు. అయినా చెక్కులు మళ్లీ వాళ్లకు వెళ్తాయి. ఇట్లా రెండో పర్యాయం వచ్చినప్పుడు వాటిని వాళ్లు స్వీకరిస్తారు. ఈ చెక్కు ద్వారా లభించే ధనంతో, వాళ్లు వచ్చే ఏడాది కూడా చిత్రమో, ఫోటోగ్రాఫో మనకు తెస్తారు. ఈ పుట్టిన రోజు బృహత్కృత్యం మూలంగా, సద్దాంకు గల ప్రతి నివాసంలోనూ అతడి అసంఖ్యాక చిత్రాలు ఫోటోలు ఉంటాయి.

ఇరాకీ మహిళా సమాఖ్యలో సజ్జీదా ప్రముఖ సభ్యురాలు. ఈ సమాఖ్య పాలక పక్షమైన బాత్ పార్టీకి అనుబంధ సంస్థ. స్త్రీల విముక్తి కోసం, స్త్రీల రాజకీయ స్వాతంత్ర్యంకోసం పనిచేసే సమాఖ్య ఇది. సద్దం చేసే సైనిక చర్యలలో సజ్జీదా భాగస్వామ్యం ఉండకపోవచ్చు గాని, అతడి కార్యక్రమాలకు ఊత ఇవ్వటం, స్త్రీలను, బాలలను ఆమె ప్రోత్సహిస్తూ ఉంటుంది.

యూరప్‌లో ఉన్న ఒక ఇరాకీ పత్రికా రచయిత మాట ప్రకారం ''ఆమె తన భర్తను గురించి లోపాయకారీగా ఏమనుకుంటూ ఉంటుందో గానీ, ప్రత్యక్షంగా కనపడేది మాత్రం అతడి పట్ల ఆమెకు గల నూటికి నూరు పాళ్ల అనుబంధం''.

— సంచా

★ I put it to you.
★ I am a bully by nature.
★ Ex parte
★ Slightly hung over.

Phone: 67148/66909.
Grams: CARDI CAP.
Telex: 0425-2043 NAAP IN

AN ADVANCED

TECHNOLOGY

FOR AN IMPROVED

QUALITY OF LIFE

NATCO

NATCO FINE PHARMACEUTICALS PVT. LTD.
Regd off: 1-10/12, Ashoknagar, Hyderabad-500 020.